
వైసీపీకి ఝలక్...!

- టీడీపీలో చేరిన ముగ్గురు జడ్పీటీసీలు


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీటీసీలు, నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: అసమ్మతి నేతలు వైసీపీకి గట్టి షాక్ ఇచ్చారు. ముగ్గురు జడ్పీటీసీలతో పాటు ఓ మాజీ జడ్పీటీసీ అధికార పార్టీకి గుడ్‌బై చెప్పారు.శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, తొట్టంబేడు జడ్పీటీసీ అర్చన దేవి, ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య, తొట్టంబేడు మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన వ్యాపారి హరినాయుడు వైసీపీలో అసంతృప్తితో కొనసాగుతున్నారు. టీడీపీ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో వారంతా బుధవారం సాయంత్రం మంగళగిరిలో ప్రత్యక్షమయ్యారు.టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఒక్కసారిగా నలుగురు కీలక నేతలు అధికార పార్టీని వీడడంతో టీడీపీలో కొత్త జోష్ నెలకొంది. ఏకగ్రీవంగా ఎన్నికైన నేతలు కూడా వెళ్లిపోవడంతో వైసీపీలో అంతర్మథనం మొదలైంది.త్వరలోనే పెద్దసంఖ్యలో ఎంపీటీసీలు, సర్పంచులు వైసీపీని వీడి టీడీపీలో చేరనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.కాగా శ్రీకాళహస్తి వైసీపీలో అసమ్మతి కలవరం మొదలైందని తొమ్మిది నెలల ముందే ఆంధ్రజ్యోతి చెప్పింది.గత ఏడాది మే 8వ తేదీ బొజ్జల నివాసంలో జరిగిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు బొజ్జల హరినాథ రెడ్డి తొలి వర్ధంతి నాడు పలువురు వైసీపీ కీలక నాయకులు బొజ్జల సోదరులకు ఘనంగా నివాళులర్పించారు.తరువాత బొజ్జల కుటుంబంతో చాలా సేపు భేటీ అయ్యారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో తమ పార్టీలో ఎలాంటి అసమ్మతి లేదని వైసీపీ చెప్పుకుంది. ఆ రోజు ఆంధ్రజ్యోతి ప్రస్తావించిన పేర్లలో ఇద్దరు తప్ప దాదాపు అందరూ బుధవారం టీడీపీలో చేరిపోవడం గమనార్హం.

రైతుపై గజ దాడి


కాకర్లవారిపల్లె సమీపంలో ఏనుగులు


గాయపడిన మనోహర రెడ్డి


ఏనుగు దాడిలో ధ్వంసమైన మంచం - వరి పంటను తొక్కుకొంటూ వచ్చిన ఏనుగు

చంద్రగిరి, ఫిబ్రవరి 14: చంద్రగిరి మండలం, చిన్నరామాపురం పంచాయతీలోని యల్లంపల్లెలో పంట పొలాలను ధ్వంసం చేసిన ఏనుగులు ఓ రైతుపై దాడి చేశాయి.20 రోజులకు పైగా మూలపల్లి, భీమవరం, చిన్నరామాపురం, శేషాపురం అటవీ ప్రాంతంలో పంట పొలాలను ఏనుగులు ధ్వంసం చేస్తున్న విషయం తెలిసిందే.మంగళవారం రాత్రి యల్లంపల్లెకు చెందిన మనోహర్‌రెడ్డి తన పొలం వద్ద మంచంపై నిద్రిస్తుండగా ఏనుగులు దాడి చేశాయి.రైతు మనోహర రెడ్డి కేకలు వేయడంతో గ్రామస్తులు అటవీశాఖకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బాణాసంచి కాల్చి ఏనుగును అటవీ ప్రాంతంలోకి తరిమారు.గాయపడిన మనోహర రెడ్డిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. కాగా ఏనుగు దాడిలో గాయపడిన మనోహరరెడ్డిని బుధవారం చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పరామర్శించారు.

కాకర్లవారిపల్లె పొలాలపై ఏనుగుల దాడి

పాకాల, ఫిబ్రవరి 14: పాకాల మండలం దామలచెరువు పంచాయతీ కాకర్లవారిపల్లె సమీపంలో పంటపొలాలపై బుధవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. ఐరాల మండలం చుక్కావారిపల్లె సమీపంలో కూడా పంటపొలాలను ఏనుగులు ధ్వంసం చేశాయి.

ఉద్యోగుల పోరుబాట

ఏపీ జేఏసీ పిలుపుతో జిల్లావ్యాప్తంగా నిరసనలు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ సురేష్‌బాబు, నిర్మల తదితరులు

తిరుపతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యల సాధనకు ఏపీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనలకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తిరుపతిలో కలెక్టరేట్ ఎదుట ఏపీ జేఏసీ జిల్లా శాఖ ఛైర్మన్ ఎస్.సురేష్ బాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశాను కలసి వినతి పత్రం అందజేశారు. రుయా ఆస్పత్రిలో సైతం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. గూడూరులో ప్రభుత్వ ఐటీఐ కళాశాలతో సహా అన్ని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, ఆర్డీవో, ఆర్ అండ్ బీ తదితర కార్యాలయాల వద్ద ఉద్యోగులు, ఉపాధ్యాయులు గుమిగూడి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వెంకటగిరిలో తహసిల్దారుకు, బాలాయపల్లిలో తహసిల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రాలు అందజేశారు. సత్యవేడు, పుత్తూరు డిపోల్లో ఆర్టీసీ ఉద్యోగులు సైతం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు చేపట్టారు. సత్యవేడు ఆత్మా కార్యాలయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. వరదయ్యపాలెం, చంద్రగిరి, పాకాల తదితర మండలాల్లో కూడా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆయా తహసిల్దారు కార్యాలయాల ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయడంతో పాటు తహసిల్దార్లకు వినతి పత్రాలు సమర్పించారు.

టీపీకోటలో మూషిక జింక



నాగలాపురం, ఫిబ్రవరి 14 : నాగలాపురం మండల పరిధిలోని టీపీ కోట గ్రామంలో అరుదైన మూషిక జింక (మౌస్ డీర్) దర్శనమిచ్చింది. రెండు రోజులకు మునుపు గ్రామానికి చెందిన షారుక్ అటవీ ప్రాంత సమీపంలోని పొలాల వద్దకు వెళ్తుండగా మూషిక జింక కనిపించింది. కాసేపటి తరువాత అది అడవిలోకి వెళ్లిపోయింది. నల్లమలై అటవీ ప్రాంతాల్లో కన్పించే ఈ మూషిక జింక గతంలో దాసుకుప్పం అటవీ ప్రాంతంలో కనిపించినట్లు సత్యవేడు ఎఫ్ఆర్‌వో జయప్రసాద్ రావు తెలిపారు.

ఎస్వీ జూపార్కుకు రెండు బెంగాల్ టైగర్స్



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 14: తిరుపతిలోని ఎస్వీ జూపార్కుకు కొత్తగా రెండు బెంగాల్ టైగర్స్ వచ్చాయి. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలోని నవాబ్ వాజాద్ అలీషా ప్రాగ్ని ఉద్యానవనం నుంచి రెండున్నర సంవత్సరాల వయసు గల ఒక మగ పులి, ఎనిమిదన్నర సంవత్సరాల వయసున్న ఆడపులిని తిరుపతికి తీసుకువచ్చినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. పులుల కొత్త జాతులను పెంపొందించాలనే ఉద్దేశంతో వీటిని తీసుకువచ్చామన్నారు. రెండు వారాల పాటు క్వారంటైన్‌లో ఉంచి తరువాత ప్రజల సందర్శనార్థం ఎన్‌క్లోజర్‌లో వదలడం జరుగుతుందని తెలిపారు. కాగా ఇప్పటికే జూలో 5 బెంగాల్ టైగర్స్ వున్న విషయం తెలిసిందే.


ఎస్వీమెడికల్ కళాశాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఏపీ జేఏసీ నేతలు

జగన్ ప్రభుత్వ తీరుపై పిడికిలి బిగించారు

● నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగ సంఘాల నిరసన

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న అణిచివేత విధానాలను రాష్ట్ర ప్రభుత్వం మానుకుని సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఏపీ జేఏసీ తిరుపతి జిల్లా చైర్మన్,ఏపీఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి నిర్మల డిమాండ్ చేశారు. దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యల సాధనకు బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనలకు శ్రీకారం చుట్టారు.నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు.అనంతరం కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలనెలా జీతాలు పడక ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగులంతా సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వె ంటనే విడుదల చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లకు అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స అందుబాటులోకి తేవాలని కోరారు.ఏపీ జేఏసీ నేతలు బాలాజీ, శ్రీనివాసులు, రవిశంకర్‌రెడ్డి, హిమగిరి, ప్రసాద్, భువనేశ్వరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి ప్రజలకు ఏం చేశారు ?

● ఎమ్మెల్యే చెవిరెడ్డికి నానీ ప్రశ్న


పులివర్తి నాని, ఈశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న స్థానిక ప్రజలు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 14: చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఏం చేశారో చెప్పాలని టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని ప్రశ్నించారు. తిరుపతి రూరల్ మండలం సాయినగర్‌లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ.. అభివృద్ధిని పక్కన పెట్టి అధికారం కోసం అడ్డదారులు తొక్కుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించే యువతను మత్తులో పెట్టారని, సమస్యలపై ప్రశ్నించకుండా మహిళలకు కుక్కర్లు ఇచ్చారని విమర్శించారు.ఎటు చూసినా వ్యర్థాలతో విష జ్వరాలతో, అంతుచిక్కని వ్యాధులతో నియోజకవర్గ ప్రజలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కూడా ప్రజా సమస్యల వైపు కన్నెతి చూడకపోవడం అన్యాయమన్నారు. ప్రజలకు రేషన్ బియ్యం 10 కేజీలకు బదులు 5 కేజీలు మాత్రమే ఇస్తున్నారని, మిగిలిన 5 కేజీలను కార్వేటినగరంలోని బీరు ఫ్యాక్టరీకి ఎమ్మెల్యే అమ్ముకుంటున్నారని ఆరోపించారు. వీటన్నింటికీ ఎన్నికల్లో ప్రజలు సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయిసుధా స్కూల్లో వేడుకగా సరస్వతి పూజ


పూజా కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సుధారాణి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 14: స్థానిక నలంద నగర్‌లోని సాయిసుధా ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో సరస్వతి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సుధారాణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులకు ఉచితంగా పలక, బలపం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ, మేనేజర్ పుష్ప, ఉపాధ్యాయులు వనతి, శారద, శోభ, రాధ, భువనేశ్వరి, శిల్ప, జీవ, భువనేశ్వరరెడ్డి, మౌనిక, శకుంతల, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో రైతుబజారు ప్రారంభం


తిరుచానూరు మార్కెట్‌యార్డులో రైతు బజారు ప్రారంభిస్తున్న మోహిత్‌రెడ్డి

తిరుచానూరు, ఫిబ్రవరి 14: తిరుచానూరులోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రూ.45 లక్షలతో నిర్మించిన రైతు బజారును తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలానికి చెందిన రైతులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మార్కెటింగ్‌శాఖ ఏడీ సురేంద్రబాబు మాట్లాడుతూ త్వరలో రైతులకు దుకాణాలను కేటాయించి త్వరలో రైతుబజారును అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎస్టేట్ ఆఫీసర్ అయప్పన్. మాజీ సర్పంచ్ గణపతినాయుడు, చంద్రగిరి మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి జానకీరామ్, మాజీ సర్పంచ్ గణపతినాయుడు, శ్రీనివాసపురం సర్పంచ్ పద్మ, పద్మావతిపురం సర్పంచ్ రాజేంద్ర, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి డీఎస్పీ బాధ్యతల స్వీకారం



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14: చంద్రగిరి డీఎస్పీగా సి.శరత్‌రాజ్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. తాడేపల్లిగూడెం డీఎస్పీగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన చంద్రగిరికి వచ్చారు. ఆ మేరకు తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లోని డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు.

రూ.4లక్షలతో ఆర్వో గది నిర్మాణం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 14: కమ్మకండ్రిగ మాజీ సర్పంచ్ కె.లక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఆమె తనయుడు ఉప సర్పంచ్ కె.వేణుగోపాల నాయుడు రూ.4లక్షలతో ఆర్వోగది నిర్మాణం చేపట్టారు. కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో ఈ గదిని వేణు పొల్కీ అధినేత లంబోదర నాయుడు బుధవారం ప్రారంభించారు.ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ డిల్లీరాణి, సింగిల్ విండో అధ్యక్షుడు వై.చంద్రశేఖరరెడ్డి, దేవరాజులు నాయుడు, అర్జున నాయుడు, భాస్కర నాయుడు, ప్రధానోపాధ్యాయులు వెంకట్రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆర్వో గది ప్రారంభిస్తున్న లంబోదరనాయుడు

ఎంపీ గురుమూర్తి ఎన్నికను రద్దు చేయాలి

● అక్రమాల అడ్డా పీఎల్ఆర్ హాల్‌ను సీజ్ చేయాల్సిందే ● అధికారులతో పాపాలు చేయించిన నాయకులపై క్రిమినల్ కేసులు పెట్టాలి
● అఖిల పక్ష సమావేశంలో వివిధ పార్టీల నాయకుల డిమాండ్


అఖిలపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఐ నేత రామానాయుడు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 14: అద్యంతం అక్రమాలతో నిర్వహించిన తిరుపతి ఎంపీ గురుమూర్తి ఎన్నిక రద్దు చేయాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. దొంగ ఓటర్లను అరికట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతూ తిరుపతి బైరాగిపట్టెడలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కాంగ్రెస్ సీనియర్ నేత మాంగాటి గోపాలరెడ్డి, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, ఆర్పీఐ అధ్యక్షుడు అంజయ్య మాట్లాడారు. దొంగ ఓట్లతో ఎన్నికైన తిరుపతి ఎంపీ గురుమూర్తి ఎన్నికను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దొంగ ఓటర్లకు నిలయమైన పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్‌ను వెంటనే సీజ్ చేయాలన్నారు. తిరుపతి కార్పొరేషన్ ఎన్నికలు కూడా అక్రమాలతో కూడుకున్నవేనని ఆరోపించారు. దొంగ ఓటర్ల వ్యవహారంలో అనేక మంది ప్రభుత్వ అధికారులు బలవుతున్నారని, అయితే, ఈ అధికారులను అక్రమాల వైపు ప్రోత్సహించిన నాయకులను గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. అప్పట్లో అన్ని పార్టీలు దొంగ ఓటర్లను అడ్డుకోవడానికి ప్రయత్నించాయని, అయితే పోలీసు యంత్రాంగం అధికార పార్టీకి దాసోహం కావడం వల్లే ఈ రోజు సస్పెండ్ కావలసి వచ్చిందని అభిప్రాయపడ్డారు. తిరుపతి కార్పొరేషన్ ఎన్నికలు రౌడీయిజంతో సాగాయన్నారు. ఒకే వర్గానికి చెందిన పోలీసు అధికారులను నియమించుకొని మిగతా అన్ని రాజకీయ పార్టీలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా వ్యవహరించారని గుర్తు చేశారు. ఆ ఎన్నికలకు పరిశీలకుడిగా వచ్చిన సిద్ధార్థజైన్ ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన రిపోర్టుతో బాధ్యులపై ఏ మాత్రం చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రత్యక్షంగా 20 వేల మంది దొంగ ఓటర్లుగా నమోదు చేసుకొని ఓటేస్తే ప్రత్యక్షంగా పట్టుకున్నా ఏ ఒక్కరిపై చర్య తీసుకోలేదన్నారు. తిరుపతి జిల్లాలో దొంగ ఓటర్ల నమోదులో మంత్రులు, ఎమ్మెల్యేల ఆఫీసులే కేంద్రాలుగా మారాయన్నారు. ఇందుకు బాధ్యులైన ప్రజా ప్రతినిధులు, అధికారులందరినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, ప్రజా సంఘాల నాయకులు శ్రీరాములు, ఎన్‌డి రవి, శివ, పద్మనాభరెడ్డి, రామకృష్ణ, గోవిందస్వామి, రామచంద్రయ్య, బండి చలపతి, ఉదయ్‌కుమార్, రామ్మూర్తి, మునీశ్వర్, ఎల్‌కె నాయుడు, బాల, అల్లాభాష, బాబు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ళ స్థలాలు...

● కుటుంబానికి ప్రోటోకాల్ దర్శనం.. లడ్డూ కార్డు ● ఎన్నికల వేళ తిరుపతి వైసీపీ నేత అలవికాని హామీలు


తిరుపతి ఎన్జీవో భవన్‌లో ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఇళ్ళ స్థలాలు... కుటుంబానికి ప్రోటోకాల్‌తో శ్రీవారి దర్శనం... లడ్డూ కార్డు... టీటీడీ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల సదుపాయాల కల్పన..! వింటుంటేనే సంతోషంతో మనసు ఎక్కడో తేలిపోతోంది కదా! సరిగ్గా ఇదే అనుభూతికి లోనయ్యారు బుధవారం తిరుపతి ఏపీ ఎన్జీవో భవన్‌లో సమావేశమైన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు. ఎన్నికల వేళ రోజూ వివిధ కులాలు, మతాలు, వర్గాలు, వృత్తిదారులతో వేర్వేరుగా ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్న నగర డిప్యూటీ మేయర్, వైసీపీ ఇంచార్జి భూమన అభినయ్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలివి. బుధవారం ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంచెలంచెల ఆందోళనకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అదే రోజు తిరుపతిలో డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి అనుకూలురైన కొందరు ఉద్యోగులు, ఎన్జీవో సంఘ నాయకులు స్థానిక ఎన్జీవో భవన్‌లో ఆత్మీయ సమావేశం ఏర్పాటుకు యత్నించారు. కొందరిని బెదిరించి, మరికొందరిని బుజ్జగించి, ఇంకొందరిని హామీలతో ఊరించి మొత్తానికి 30మందిని పోగేశారు. అభినయ్‌రెడ్డిని ఆహ్వానించారు. వారితో సమావేశమైన యువనేత టీటీడీ ఉద్యోగుల తరహాలో తిరుపతిలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ళ స్థలాలు ఇప్పిస్తామని, కుటుంబాలతో శ్రీవారిని దర్శించుకునేలా ప్రోటోకాల్ దర్శనం ఏర్పాటు చేస్తామని, లడ్డూ కార్డులు కూడా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వింటున్న ఉద్యోగులు, ఎన్జీవో సంఘ నాయకులకు మతిపోయినంత పనైంది. టీటీడీని తమ సొంత సంస్థలా భావిస్తే తప్ప ఇలాంటి హామీలు ఇవ్వడం సాధ్యపడదని ఉద్యోగ వర్గాలకే చెందిన పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యవహారం రెండు విధాలా దుమారం రేపుతోంది. టీటీడీని తమ రాజకీయ అవసరాలకు, ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకునేందుకు యత్నిస్తుండడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. మరోవైపు రాష్ట్రమంతా ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు శ్రీకారం చుడితే తిరుపతిలో మాత్రం అదే అధికార పార్టీ నేతతో కూడా ఎన్జీవో భవన్‌లోనే ఆత్మీయ సమావేశం ఎలా నిర్వహించారన్న ప్రశ్న తలెత్తుతోంది. దీనిపైనా జిల్లావ్యాప్తంగా ఉద్యోగుల నుంచీ ఎన్జీవో సంఘ నాయకులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగుల నైతిక స్థైర్యం దెబ్బ తీసేలా కొందరు ఉద్యమ నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

చంద్రగిరి,ఫిబ్రవరి14:తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ బుధవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలు ఆలస్యం అవుతున్నందున 30 శాతం ఐఆర్‌ను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఏఎస్వో స్వర్ణలత, డీటీ అమృత, ఆర్ఐ సులోచన, ఎంపీహెచ్‌వో ఈశ్వరయ్య, ఏఈవో మురళీధర్, ఉపాధ్యాయుడు రామిరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, పెన్షనర్ల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, పెన్షనర్లు

పాకాల, ఫిబ్రవరి 14: జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, పెన్షనర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. డీఏ, పీఆర్సీ, ఏపీజీఎల్ఐసీ బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండు చేశారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రఫీ, కొండారెడ్డి, జయచంద్ర, పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు ఆంజినేయులు, జయబాల, రామచంద్ర, తులసీరామ్, రాజేంద్రుడు, బీటీఏ నాయకులు జ్యోతిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊర్ల పేర్లు, ఇంటి నెంబర్లతో ఓటరు జాబితా


ఇంటి నెంబర్లకు బదులుగా వీధులు, ఊరి పేర్లతో ఉన్న ఓటరు జాబితా

భాకరాపేట, ఫిబ్రవరి14: చిన్నగొట్టిగల్లు మండల ఓటరు జాబితాలో చిత్రవిచిత్రాలు చోటు చేసుకున్నాయి. పోలింగ్ కేంద్రం 41లోని ఓటర్ల జాబితాలో ఇంటి నెంబర్లకు బదులు వీధులు, ఊర్ల పేర్లు వచ్చాయి. ఈ పోలింగ్ కేంద్రంలో సీరియల్ నెం.837లో ఇంటి సంఖ్య స్థానంలో సీ-10, సీరియల్ నెం.899కు బదులు సీ109, సీరియల్ నెం.841కు బదులు ఈ-44 అని వచ్చాయి. అలాగే సీరియల్ నెం.272 నుంచి 276 వరకు, 571 నుంచి 578 వరకు, 837 నుంచి 854 వరకు ఇంటి నెంబర్లు ఉండాల్సిన చోట గొల్లపల్లె ముత్యాలమ్మ, గుడివీధి, ఫాతిమా నగర్, టీచర్స్ కాలనీ, నల్లపురెడ్డిగారిపల్లె హరిజనవాడ, గాంధీ నగర్ అని వచ్చాయి.

ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వండి

చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కుటుంబాలు

పాకాల, ఫిబ్రవరి 14: చంద్రగిరి ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే ఆదర్శంగా అభివృద్ధి పనులు చేస్తానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని అన్నారు. మద్దినాయనిపల్లె పంచాయతీలో బుధవారం ఆయన పర్యటించారు. వెంట్రామాపురం నుంచి మద్దినాయనిపల్లె కొత్తవడ్డిపల్లె వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పులివర్తి నాని మాట్లాడుతూ మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు భూములు కూడా మిగలవని, డ్వాక్రా సంఘాల్లో డబ్బులు ఉండవన్నారు.అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా డీకేటీ భూములు రెగ్యులరైజ్ చేసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం వైసీపీకి చెందిన 50 కుటుంబాలు పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరాయి. విక్రమ్, కుమారస్వామి, మల్లికార్జున, చంద్రశేఖర్, రవికుమార్, భాస్కర్, శ్రీనివాసులు, ఉదయకుమార్, కృష్ణమూర్తి, కిశోర్, బాబి, జగదీష్, లక్ష్మీపతి తదితరులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.టీడీపీ సీనియర్ నాయకుడు వలపల దశరథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఏఆర్ఎల్‌లో స్వచ్ఛత పక్షోత్సవాల బెలూన్ ఆవిష్కరణ



పాకాల, ఫిబ్రవరి 14: పాకాల మండలంలోని గాదంకి జాతీయ వాయు మండలీయ పరిశోధన ప్రయోగశాల (ఎన్ఏఆర్ఎల్)లో బుధవారం స్వచ్ఛత పక్షోత్సవాల బెలూన్ ఆవిష్కరించారు. పక్షోత్సవాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ రహదారి సమీపంలో ఎన్ఏఆర్ఎల్ ఎదుట బెలూన్ ఆవిష్కరించి మెరుగైన పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. గాదంకి, నేంద్రగుంట, గుడివారిపల్లె గ్రామాల్లో ఉద్యోగులు, పరిశోధక విద్యార్థులు పర్యటించి ప్లాస్టిక్ వినియోగంతో తలెత్తే అనర్థాల గురించి వివరించారు. జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. గాదంకి జడ్పీ హైస్కూల్‌లో చిత్రలేఖనం పోటీలు, ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ చర్యలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పక్షోత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు డాక్టర్ దుర్గారావ్, రేవతి, నాగరాజ, యశ్వంత్, హరీష్ వర్మ, ఎం.శ్రీనివాస గుప్త తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని కూలీ మృతి


మృతిచెందిన శ్రీనివాసులు

పాకాల, ఫిబ్రవరి 14: పాకాల మండలం గాదంకి సమీపంలో బుధవారం రాత్రి కారు ఢీకొని ఓ కూలీ మృతి చెందాడు. మృతుడు ఐరాల మండలం పాటూరుకు చెందిన శ్రీనివాసులు(60)గా గుర్తించారు. మృతుడు గాదంకి సమీపంలో ఓ ఇసుకబట్టీలో పనిచేస్తున్నాడు. గాదంకి సమీపంలో రోడ్డు దాటుతుండగా బెంగుళూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. పాకాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక చేయూత


చెక్‌ను అందజేస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14: అకాలమరణం చెందిన ఓ హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ మలికాగర్గ్ ఆర్థిక చేయూతనందించారు. అలిపిరి స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ కొండూరు చలపతి జనవరి 7వ తేదీన అనారోగ్యంతో మరణించారు. జిల్లా పోలీసు సంక్షేమ నిధి నుంచి రూ.50 వేలు, ఫ్లాగ్ ఫండ్ కింద రూ.25 వేలకు సంబంధించిన చెక్‌ను బుధవారం తన ఛాంబర్‌లో హెడ్‌కానిస్టేబుల్ సతీమణికి అందజేశారు. కారుణ్య నియామకం కింద కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఆమెకు హామీ ఇచ్చారు.

సిద్ధుల రవిని అరెస్టు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇళ్ల పోరాట సమితి సభ్యులు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 14: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల కరకంబాడి పంచాయతీలో సిద్ధుల రవి అనే వ్యక్తి ఏకంగా కొండను ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నాడని, గ్రామ లెక్క దాఖల సర్వే నెంబరు.153/1 ప్రకారం ఆ గుట్టప్రాంతం ప్రభుత్వానికి సంబంధించిందని ఇళ్ల స్థలాల పోరాట కమిటీ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. గుట్టలోని రాళ్లు, మట్టి, ఇసుక అమ్ముకుని రూ.2వేల కోట్లు వెనుకేసుకున్నాడన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రేణిగుంట మండలంలోని ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు కబ్జా చేసుకుని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కోర్టులో కేసులున్న భూములను సైతం వదలడం లేదన్నారు. పేదలకు జగనన్న ఇంటి పట్టాలిచ్చి స్థలాలు మాత్రం చూపలేదన్నారు. వాస్తవానికి సిద్ధుల రవికి కేవలం 2.60 ఎకరాలు మాత్రమే భూమి ఉందని, 153/1లోని భూమిపై వ్యాజ్యం నడిచిందని, కోర్టు వారు రవిపై కేసులు నమోదు చేయాలని సూచించినా రెవెన్యూ అధికారులు ముందడుగు వేయడం లేదని అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసే వరకు ఇళ్ల స్థలాల పోరాట కమిటీ పోరాడుతుందన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.55 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం 4.55 లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 68,363 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,609 మంది తలనీలాలు సమర్పించారు.

పుల్వామా అమర జవాన్లకు నివాళి


అమరవీరులకు శ్రద్ధాంజలి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 14: పుల్వామాలో ఉగ్రదాడికి బలైపోయిన భారత సైనికులకు బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఉగ్రవాద దాడిలో 40 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనను గుర్తు చేసుకుంటూ బుధవారం కపిలతీర్థం పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. కాసేపు మౌనం పాటించి, వారి ఆత్మశాంతికి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, ప్రభాకర్‌నాయుడు, మల్లకుప్ప రాజశేఖర్, సుబ్రహ్మణ్యం యాదవ్, చంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజారెడ్డి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

తాహసున్నీషాబేగం ఆధ్వర్యంలో..

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 14: ఇంటర్నేషనల్ ఇంపాక్ట్ విజడమ్ క్లబ్ ప్రెసిడెంట్, ఉయ్ సపోర్ట్ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు తాహసున్నీషాబేగం ఆధ్వర్యంలో తిలక్‌రోడ్డులోని విలాసిటీ ఐఐటీ అండ్ నీట్ అకాడమీలో విద్యార్థులకు పుల్వామా ఘటనపై బుధవారం అవగాహన కల్పించారు.అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అకాడమీ డైరెక్టర్ వీరశేఖర్, క్లబ్ సభ్యులు డాక్టర్ నూర్‌ఫర్వీన్, సయ్యద్‌సుమయా, గుణశేఖర్ పాల్గొన్నారు.




పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న గల్లా కుటుంబీకులు - ఆకట్టుకున్న విద్యార్థుల కళా ప్రదర్శన

పేటమిట్టలో కుంభాభిషేక మహోత్సవాలు

పూతలపట్టు, ఫిబ్రవరి 14: పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మూడో రోజైన బుధవారం ఘనంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గ్రామంతో పాటు ఆలయాల చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలంకరణ పలువురిని ఆకట్టుకుంటోంది. బుధవారం వేకువజామున గణపతి వేణుగోపాలస్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. బ్రహ్మముహూర్త సమయంలో మహాగణపతి స్వామివారి మూషిక వాహనం విగ్రహ స్థాపన జరిగింది. ఉదయం 8 గంటల నుంచి జరిగిన వేదస్వస్తి ప్రతిష్ఠమూర్తులకు శ్రీరామ సహస్రనామ హవనం, ఆంజనేయ సహస్ర హోమాలు, దర్బారు సేవ, చతుర్వేదస్వస్తి తదితర పూజా కార్యక్రమాల్లో గల్లా రామచంద్రనాయుడు, అరుణకుమారి, జయదేవ్ పాల్గొన్నారు. సాయంత్రం 7 గంటలకు నిర్వహించిన పండరి భజనలు, కోలాటాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు యువరాజులు నాయుడు, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, మాజీ కన్వీనర్ చంద్రమౌళి, నాయకులు చింతగుంపల రజినీ, బీసీ నాయకులు షణ్ముగం, గల్లా కుటుంబసభ్యులతో పాటు ట్రస్టు సభ్యులు గల్లా రామానాయుడు, భానుమూర్తి నాయుడు, స్థానికులు పాల్గొన్నారు. గురువారం ఉదయం 4 గంటల నుంచి విగ్రహప్రతిష్ఠ, అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవం జరగనున్నాయి.

అలరించిన సంగీత నృత్యోత్సవం







మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి



కథకళి



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 14: భారతీయ సంప్రదాయ కళలైన సంగీతం, నృత్యం, వాద్యకళలను ప్రోత్సహించేందుకు టీటీడీ కృషి చేస్తోందని చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో టీటీడీ ఎస్వీసంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాల ఆధ్వర్యంలో కళావైభవం పేరిట నిర్వహించిన మూడ్రోజుల దక్షిణ భారత సంగీత నృత్యోత్సవం బుధవారం ప్రారంభమైంది.సాయంత్రం సంగీత కళాశాలలో సుదీర్ఘకాలం సేవలందించిన పూర్వ, ప్రస్తుత ప్రిన్సిపాళ్లను, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కోమండూరు శేషాద్రి, ఆరవేటి ప్రభావతి, పుల్లెల పేరి సోమయాజులు, చల్లా ప్రభావతి, వైవీఎస్ పద్మావతి, డాక్టర్ ఎస్.జమునారాణి, ఎం.జగన్నాథయ్య, కుమారి భ్రమరాంబ, దేవేంద్రపిళ్లై, కె.భాస్కర్, ఎం.సుధాకర్‌లను సత్కరించారు. జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ ఆర్ కృష్ణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన వయొలిన్ విద్వాంసురాలు కన్యాకుమారి,ఎస్వీ వేదవర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి,శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి,టీటీడీ జేఈవో వీరబ్రహ్మం,డీఈవో భాస్కర్‌రెడ్డి, ముఖ్యగణాంకాధికారి, సంగీత కళాశాల ప్రత్యేకాధికారి శేషశైలేంద్ర, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దుబాల, అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర, వాద్య, నృత్య ప్రదర్శనలు

సంగీత నృత్యోత్సంలో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన గాత్ర, వాద్య సంగీత, కూచిపూడి, భరతనాట్య, కథాకళి నృత్య ప్రదర్శనలు అదరహో అనిపించాయి. ఉదయం ఎస్వీ నాదస్వర, డోలు పాఠశాల విద్యార్థులు మంగళధ్వని వినిపించగా ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థుల వీణావాద్య కచేరితో అలరించారు.హైదరాబాద్‌కు చెందిన పొట్టి శ్రీరాములు వర్సిటీ విద్యార్థులు గాత్ర సంగీతంతో ఆకట్టుకున్నారు. సాయంత్రం ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థులు కూచిపూడి నృత్యాన్ని లయబద్ధంగా ప్రదర్శించారు. తమిళనాడులోని చిదంబరానికి చెందిన అన్నామలై వర్సిటీ విద్యార్థులు నాదకచేరి చక్కగా నిర్వహించారు. మద్రాస్ వర్సిటీ విద్యార్థుల భరతనాట్య ప్రదర్శన రక్తికట్టించింది. కేరళ రాష్ట్రం త్రిశూర్‌కి చెందిన కళామండలం అరుణ్‌రాజ్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన లవణాసుర సంవాదం కథాకళి నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది. సీతగా కళామండలం అరుణ్‌రాజ్, లవుడుగా కళామండలం జ్యోతిష్, కుశుడుగా కళామండలం హరికృష్ణన్ వ్యవహరించారు. బ్రాహ్మణ పిల్లల పాత్రను హ్రిదున్, విపిన్ పోషించారు. కాగా ఈ డ్రామాకు కె.కార్తీక్, కె.ఆనందు సంగీతం అందించారు.



కళాశాల పూర్వ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు సన్మానం

నేడు క్షత్రియ భవనానికి భూమిపూజ

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 14: క్షత్రియ భవనానికి గురువారం భూమిపూజ నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు సూరప్ప శివరామరాజు, అధ్యక్షుడు బలరామరాజు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండేవిధంగా తిరుపతి-బెంగళూరు హైవే సమీపంలోని తూకివాకం వంతెన వద్ద భవన నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. మాజీ ఎంపీ డాక్టర్ గోకరాజు గంగరాజు, రేవా యూనివర్సిటీ డాక్టర్ శ్యామరాజు, విజయనగరం ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరాజు, వెంకటరాజు, శేఖర్‌రాజు, సుకుమార్‌రాజు పాల్గొన్నారు.

'ఊరుపేరు భైరవకోన' కథ కొత్తగా ఉంటుంది

హీరో సందీప్‌కిషన్



ఆలయం ముందు సందీప్ కిషన్, వర్ష

తిరుపతి(కొర్లగుంట)/ తిరుమల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 14: 'ఊరుపేరు భైరవకోన' సినిమా కథ కొత్తగా ఉంటుందని, రెండేళ్ల పాటు చిత్రీకరించిన ఈ చిత్రం శుక్రవారం తెరమీదకు రానుందని హీరో సందీప్‌కిషన్ వెల్లడించారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా హీరోయిన్ వర్షతో కలసి తిరుపతికి వచ్చిన అయన ఒక హోటల్లో మీడియాతో మాట్లాడారు. భైరవకోన సినిమా బుధవారం ప్రీరిలీజ్ చేశామని, అందుకే శ్రీవారి దర్శనం కోసం వచ్చామని తెలిపారు. సెల్ఫీల కోసం అభిమానులు ఎగబడడంతో కాసేపు సందడి వాతావరణం నెలకొంది. అంతకుముందు వారు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మాట్లాడుతూ భైరవకోన సినిమా మంచి విజయం అందుకుంటుందన్న నమ్మకం ఉందన్నారు. 14 సంవత్సరాలుగా తన చిత్రాలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. హీరోయిన్ వర్ష మాట్లాడుతూ సినిమా విజయం కోసం స్వామిని ప్రార్థించామన్నారు.

ముగిసిన ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాలు



డ్రైవర్లకు ప్రతిభ అవార్డులు అందజేస్తున్న అధికారులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 14: తిరుపతి డిపో గ్యారేజీ ఆవరణలో ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాలు బుధవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి, అతిథులుగా ఆర్టీవో ఆదినారాయణ, ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప, ఆర్టీసీ సీఎంఈ నరసింహులు, డిప్యూటీ సీటీఎం భాస్కర్ పాల్గొని ప్రసంగించారు. ప్రమాద రహిత ప్రయాణమే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఇంధనం పొదుపు చేయాలని సూచించారు. అనంతరం 33 ఏళ్లకు పైగా ప్రమాదరహితంగా బస్సులు నడుపుతున్న డ్రైవర్లకు నగదు బహుమతి ప్రదానం చేశారు. కె.వి.సుధాకర్(సత్యవేడు)ప్రథమ, కె.భక్తవత్సలం(వాకాడు) ద్వితీయ, ఎస్.సి.దొరై(మంగళం డిపో) తృతీయ బహుమతులతో పాటు ప్రతిభ అవార్డులు అందించారు. ప్రతి డిపోకూ ముగ్గురు చొప్పున ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్లు బాలాజీ, రామచంద్రనాయుడు, భాస్కర్, హరిబాబు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

20వ తేదీన జాబ్‌మేళా

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 14: ఏపీఎస్ఎస్‌డీసీ రీజనల్ మెగా జాబ్‌మేళా పోస్టర్లను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా తిరుపతిలోని ఆయన నివాసంలో బుధవారం ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ఐదవ తరగతి పాస్/ఫెయిల్, పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమో, పీజీ ఉత్తీర్ణత అయిన యువతీ యువకులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీన శ్రీవెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఆర్‌వీఎస్‌నగర్, చిత్తూరులో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు లోకనాథం, మురళి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశా పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా సంజీవయ్య ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, అధికారులు చెన్నయ్య, బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహిస్తాం

● అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు అకౌంట్, చెక్‌బుక్ తప్పక కలిగి ఉండాలి ● కలెక్టర్ లక్ష్మీశా



రాజకీయ పార్టీ నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశా

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలతో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ, తుది జాబితాపై అభ్యంతరాలు, ఎన్నిక సన్నద్ధతపై ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వ్యయం కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతా, చెక్‌బుక్‌ను నామినేషన్ వేసే ముందురోజు లోపు కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వాటిలో సవరణలు ఉంటే సంబంధిత ఈఆర్వోలు ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుందని తెలిపారు. డీఆర్వో పెంచలకిషోర్ తుది ఓటర్ల జాబితా ప్రచురణపై క్లైంలు, అభ్యంతరాలు, ఫారం 6, 7, 8 తదితరాలపై వివరించారు. ఈఆర్వో రవిశంకర్ రెడ్డి, నిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దొంగ ఓట్లు ఒక బూత్‌లో తొలగించి మరో బూత్‌లో నమోదు : పులివర్తి సుధారెడ్డి

దొంగ ఓట్లు ఒక బూత్‌లో తొలగించి మరో బూత్‌లో నమోదు చేస్తున్నారని టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి కలెక్టర్ లక్ష్మీశాకు ఫిర్యాదు చేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయని, ఆధారాలు సమర్పించినా డెట్ ఓట్లు తొలగించలేదని ఆరోపించారు. ఓటర్ల తుది జాబితా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో భారీగా డబుల్ ఎంట్రీలు, డెత్ ఓట్లు ఉన్నాయని ఫిర్యాదు చేసినా వాటిని తొలగించలేదన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న నాసిర్‌బాషా

ఐపీసీ మైనారిటీ సెల్ జాతీయ కార్యదర్శిగా నాసిర్‌బాషా

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 14 : ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం జాతీయ కార్యదర్శిగా తిరుపతికి చెందిన టి.నాసిర్‌బాషా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి చేతుల మీదుగా బుధవారం నియామక పత్రం అందుకున్నారు. యశోదనగర్‌లోని వేమనవిజ్ఞాన కేంద్రంలో బుధవారం ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్లీనరీ సమావేశం, ఐదవ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ మాతృప్రేమతో పరిపాలన అందించాలనే ఆశయంతో పార్టీ ఆవిర్భవించిందని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఏకాగ్రతతో లక్ష్యం సాధించాలి



మాట్లాడుతున్న సెట్విన్ సీఈవో మురళీకృష్ణ

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 14 : ప్రణాళిక, ఏకాగ్రతతో లక్ష్యం సాధించాలని సెట్విన్ సీఈవో మురళీకృష్ణ యువతకు సూచించారు. భైరాగిపట్టెడలోని ఎంజీఎం ఉన్నత పాఠశాలలో బుధవారం వ్యక్తిత్వ వికాసం, లక్ష్య సాధనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒత్తిడిని ఛేదించగలిగితే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు, ప్రస్తుత పోటీ ప్రపంచంలో పదవ తరగతి నుంచే ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఇంప్యాక్ట్ విజ్డంక్లబ్ తిరుపతి ప్రెసిడెంట్ తాహసున్నీషాబేగం, సూరి, దిశా ఎస్సై రోషిణి, శ్రావణి, విజిత, పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, కార్పొరేటర్ రామానాయుడు, సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఇంటర్ మోడల్ బస్‌స్టేషన్‌కు ఆదేశాలివ్వండి



కేంద్రమంత్రి గడ్కరితో ఎంపీ గురుమూర్తి

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 14 : కొంతకాలంగా పెండింగులో ఉన్న తిరుపతి ఇంటర్ మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి ఆదేశాలివ్వాలని ఎంపీ గురుమూర్తి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. బుధవారం ఢిల్లీలో ఎంపీ కేంద్ర మంత్రితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సెంట్రల్ బస్‌స్టేషన్‌లో స్థలాభావం కారణంగా బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. భవనం పాడైపోయిందని, చాలీచాలని వసతులతో ప్రయాణికులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారని అన్నారు. అలాగే నాయుడుపేట సమీపంలోని వీర్నమల గ్రామం మీదుగా వెళ్తున్న జాతీయ రహదారికి అండర్‌పాస్ ఏర్పాటు చేస్తే తరచూ రోడ్డు దాటుతున్న విద్యార్థులకు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. చెన్నై నుంచి అరక్కోణం, పుత్తూరు మీదుగా రహదారి విస్తరణకు ఉత్తర్వులు జారీ చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

గంగమ్మతల్లి ప్రతిష్ట దిగజార్చారు



సమావేశంలో మాట్లాడుతున్న మునికృష్ణ

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 14: జాతర పేరుతో వసూళ్లు, ఆలయ నిధులు దుర్వినియోగం చేసి అధికార పార్టీ నాయకులు గంగమ్మతల్లి ప్రతిష్ఠను దిగజార్చారని, ఈ విషయంలో చర్చకు సిద్ధమా అని గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ ఆర్‌సీ మునికృష్ణ సవాల్ విసిరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో అయన మాట్లాడుతూ ఆలయంలో సంప్రదాయాలు పాటించకుండా చేసే కార్యక్రమాల వల్ల భక్తులు లోనికి రావాలంటేనే ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. మరో రెండు నెలల్లో జాతర వస్తున్నప్పటికీ ఆలయ నిర్మాణం పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. ఆలయంలో రూ.52లక్షలు అవకతవకలకు పాల్పడింది మీరు కాదా అని నిలదీశారు. ఆలయంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని చెప్పామే తప్పా పార్టీ నినాదాలు చేయలేదని తెలిపారు. టీడీపీ, జనసేన ప్రభుత్వ హయాంలో జాతర అంటే ఎలా ఉండాలో చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, మంగమ్మ, రాజయ్య, సూర్యనారాయణరెడ్డి, సుబ్బుయాదవ్, జగన్నాథం, మునిప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె వివాహం రద్దయిందని..

ఇంటినుంచి వెళ్లిపోయిన తల్లి



వెళ్లిపోయిన సుగుణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14: కుమార్తె వివాహం రద్దవడంతో ఓ వృద్ధురాలు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన తిరుపతిలో చోటుచేసుకుంది. రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ షేక్షావలి తెలిపిన వివరాల ప్రకారం... టెలిఫోన్ కాలనీకి చెందిన సుబ్బయ్య భార్య సుగుణ (59) పెద్ద కుమార్తె వివాహానికి హైదరాబాద్‌కు చెందిన యువకుడితో సోమవారం నిశ్చయతాంబూలం జరిగింది. మంగళవారం ఉదయం కాల్ చేసిన వరుడి కుటుంబసభ్యులు వివాహాన్ని రద్దు పరుచుకుంటున్నట్టు చెప్పారు. మనఃస్థాపం చెందిన సుగుణ మంగళవారం సాయంత్రం ఇంటినుంచి వెళ్లిపోయింది. మంగళసూత్రం, కమ్మలు తీసి ఇంట్లో ఉంచి ఎటో వెళ్లిపోయింది. వెళ్లినపుడు గులాబీ రంగు చీర, జాకెట్ ధరించి ఉందని, ఆచూకీ తెలిసినవారు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ షేక్షావలి విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 14: రానున్న సార్వత్రిక ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్, ఆర్వో శుభం బన్సల్ అన్నారు. బుధవారం స్థానిక విశ్వోదయ డిగ్రీ కళాశాలలో సెక్టారు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 298 పోలింగ్ బూత్‌ల పరిధిలో 3లక్షలు ఓటర్లు ఉన్నారని తెలిపారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రతి వంద మీటర్లకు మార్జిన్ ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే దివ్యాంగులకు తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో సీఆర్వో కోదండరామిరెడ్డి, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్బన్ బ్లాక్ పరిశ్రమకు శంకుస్థాపన



పరిశ్రమల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: రాష్ట్రప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తోందని మంత్రి గుడివాడ అమరనాథ్ తెలిపారు. బుధవారం విజయవాడ నుంచి ఆయన జిల్లాలో రెండు పరిశ్రమలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి మాట్లాడుతూ నాయుడుపేట స్పెషల్ జోన్‌లో ఆదిత్యబిర్లా గ్రూప్ రూ.1,198కోట్లతో నెలకొల్పనున్న కార్బన్ బ్లాక్ తయారీ యూనిట్ ద్వారా 250మందికి ఉపాధి లభించనుందన్నారు.అలాగే హెల్లా ఇన్ఫ్రా రూ.350 కోట్లతో ఏర్పాటు చేయనున్న పీవీసీ పైప్స్, ఫిట్టింగ్ తయారీ ద్వారా 35మందికి ఉపాధి కలుగుతుందన్నారు. అలాగే వైజాగ్-చెన్నై కారిడార్‌లో రూ.423 కోట్లతో శ్రీకాళహస్తి-చిత్తూరు సౌత్ క్లస్టర్ స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు ద్వారా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ తదితరాల ఏర్పాటుకు భూమిపూజ చేశారు.సంబంధిత పరిశ్రమల ప్రతినిధులతో కలిసి జిల్లాపరిశ్రమల శాఖ అధికారి ప్రతాపరెడ్డి, ఏపీఐఐసీ జడ్ఎం చంద్రశేఖర్, తిరుపతి స్పెషల్‌జోన్ అధికారి విజయరత్నం పాల్గొన్నారు.

20వ తేదీన జాబ్‌మేళా

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 14: ఏపీఎస్ఎస్‌డీసీ రీజనల్ మెగా జాబ్ మేళా పోస్టర్లను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా తిరుపతిలోని ఆయన నివాసంలో బుధవారం ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ఐదవ తరగతి పాస్/ఫెయిల్, పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమో, పీజీ ఉత్తీర్ణత అయిన యువతీ యువకులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీన శ్రీవెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఆర్‌వీఎస్‌నగర్, చిత్తూరులో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు లోకనాథం, మురళి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ఇన్‌స్పైర్ జిల్లా విజేతకు అభినందన



విద్యార్థిని ఆశను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 14: శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 10, 11వ తేదీల్లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్‌లో పుత్తూరు మండలం, గోపాలకృష్ణాపురం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న వి.ఆశ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. గైడ్ టీచర్ విజయకుమారి ఆధ్వర్యంలో విద్యార్థిని ఆశ ప్రదర్శించిన 'వై షై మదర్ లూసింగ్ హర్ టీత్ వైల్ కటింగ్ షాంపూ సాచెట్స్' అనే ప్రాజెక్టుపై దంతక్షయాన్ని నివారించే పరికరం రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైంది. బుధవారం ఆశను ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి ధనంజయ సారథి పాల్గొన్నారు.

సుబ్రమణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పుత్తూరు, ఫిబ్రవరి 14: పుత్తూరు పట్టణంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం వాస్తుశాంతి జరిపారు. 15వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభమౌతాయని ఆలయ ధర్మకర్త సుందరం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనె 25వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం పట్టణంలో ఊరేగింపు జరుగుతాయన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

పుత్తూరు, ఫిబ్రవరి 14: పుత్తూరు ఆర్టీసీ డిపోలో కార్మికులు నల్ల బ్యాడ్జీలను ధరించి బుధవారం నిరసన తెలిపారు. ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ప్రస్తుతం వున్న కాలపరిమితి పూర్తయి నడపడానికి వీలుపడని యాభైశాతం బస్సుల స్థానంలో కొత్తవి కొనుగోలు చేయాలన్నారు. అలాగే ఉద్యోగుల పదవీ విరమణ ప్రారంభమైనందున డైరెక్ట్ రిక్రూట్మెంట్‌తో పాటు కారుణ్య నియామకాలను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్, జోనల్ కమిటీ మెంబరు ఆర్ముగం, డిపో అధ్యక్షుడు సుందరం, కార్యదర్శి శివకుమార్, గ్యారేజ్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి దొరబాబు పాల్గొన్నారు.

రైతన్నలకు అండగా బిజేపీ

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 14: రైతన్నలకు బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ తెలిపారు. బుధవారం పుత్తూరు మండల పరిధిలోని వేపగుంట, ఉత్తరపుకండ్రిగ గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను, క్యాలండర్లను అందజేశారు. రాబోవు ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మునస్వామి, ఓబీసీ జిల్లా కార్యదర్శి శంకర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి నాయుడు, మండల ఉపాధ్యక్షుడు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కల్యాణ మండపానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కరుణాకర్‌రెడ్డి, రోజా

నగరి ఫిబ్రవరి 14: నగరి మండల పరిధిలోని బుగ్గలో గల శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి సమేత అన్నపూర్ణేశ్వరి ఆలయంలో బుధవారం రూ.2 కోట్లతో నిర్మించే కల్యాణ మండపానికి టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మంత్రి ఆర్కే రోజా శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మోహన్‌కృష్ణ, ఎంపీపీ భార్గవి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ
నలుగురు మహిళలకు గాయాలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 14: నాయుడుపేట - మేనకూరు సెజ్ సమీపంలో ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. మేనకూరులోని వివిధ పరిశ్రమల్లో పనిచేసే మహిళలు ఆటోలో బయలుదేరారు. మేనకూరు సమీపంలో వెళ్తుండగా ఆటోను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సురేఖ తీవ్రంగా గాయపడగా సులోచన, వజ్రమ్మ, జ్యోతి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సురేఖ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

ధాన్యం రైతు దగా
ముందొక ధర.. కోతలయ్యాక మరో ధర
కనిపించని కొనుగోలు కేంద్రాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 14: ధాన్యం దళారుల పాలవుతోంది. కోతకు ముందు ఓ ధర.. తర్వాత మరో ధర ఇస్తూ వ్యాపారులు అందినకాడికి దోచేస్తున్నారు. సూళ్లూరుపేట డివిజన్ పరిధిలో ఈ ఏడాది రబీ సీజన్ అక్టోబరులో ప్రారంభం కాగా పలుచోట్ల ఆదిలోనే వరినాట్లు వేయడంతో జనవరి చివరిలోనే నూర్పిళ్లు మొదలయ్యాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, ఉన్న ఆర్బీకేలు అలంకార ప్రాయంగా మారడంతో రైతులు దగా పడుతున్నారు. ప్రారంభంలోనే వరినాట్లు వేసిన పంటలు మిచౌంగ్ తుఫాన్ ప్రభావానికి నీటి మునిగి రైతులు చాలా వరకు నష్టపోయారు. ఉన్న అరకొర పంట చేతికొచ్చినా గిట్టుబాటు ధర లేకపోవంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 15 వేల హెక్టార్ల పైగా వరిపంట సాగుచేశారు. బీపీటీ 5209(పెద్దజిలకర), ఎన్ఎల్ఆర్ 34449(నెల్లూరు జిలకర), కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048(షుగర్ లెస్) రకం సాగుచేయగా పలుచోట్ల వరికోతలు జోరుగా సాగుతున్నాయి. ఎకరాకు 15నుంచి 30 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తోంది. పెట్టుబడులు మాత్రం గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా ఖర్చు చేశారు. ఇంత చేసినా కొన్నిచోట్ల 15-20 బస్తాలు మించి దిగుబడి రాకపోవడంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. సూళ్లూరుపే మండలంలోని మంగళంపాడు, కోటపోలూరు, ఇలుపూరు, మంగానెల్లూరు, మన్నారుపోలూరు, ఆబాక, డేగలపాలెం, తడ మండలంలోని కొండూరు, గ్రద్దగుంట, మాంబట్టు, ఎన్ఎం కండ్రిగ, దొరవారిసత్రంలో కల్లూరు, శ్రీధనమల్లి, మేలుపాక, పూలతోట గ్రామాల్లో వరి కోతలు పూర్తి చేసిన రైతులకు ధాన్యాన్ని దాచుకోనేందుకు గోదాముల సౌకర్యంలేదు. దీంతో దళారులను ఆశ్రయించి గిట్టుబాటు ధర లేకపోయినా అయిన కాడికి విక్రయించేస్తున్నారు.



పొలాల్లోనే విక్రయించి లారీలో లోడు చేస్తున్న ధాన్యం బస్తాలు



కల్లాలు లేకపోవడంతో జాతీయ రహదారిపై ధాన్యం ఆరబెట్టిన రైతులు

పడిపోయిన ధరలు..

పంట కోత దశలో రికార్డు స్థాయిలో ఉన్న ధర రైతు చేతికి ధాన్యం గింజలు వచ్చేసరికి బాగా పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వారం రోజుల క్రితం పుట్టి ధాన్యం రూ.24,500 ఉండగా నేడు రూ.20,500 - 22,500 వరకు పడిపోయింది. ఇదే అదునుగా దళారులు రైతులకు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇంకా ధరలు తగ్గిపోతాయన్న ఆందోళనతో రైతులు ధాన్యాన్ని పొలాలు, కళ్లాలోనే అమ్మి వచ్చిందే ఆదాయమని సొమ్ముచేసుకొంటున్నారు. బీపీటీ పెద్దజిలకర వారం రోజుల కిందట 75 కిలోల బస్తా రూ.2,200 పలికింది. ప్రస్తుతం రూ.రూ.1800కి పడిపోయింది. అదే విధంగా ఆర్ఎన్ఆర్ రకం రూ.1900కి పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు మాత్రం రైతుల వద్దకొనుగోలు చేసిన మరుక్షణమే ఎక్కువ ధరకు ధాన్యం బస్తాలను అమ్ముకొంటున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

నకిలీ స్టాంపులు, జామీను పత్రాల తయారీ ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటరామిరెడ్డి

వెంకటగిరి, ఫిబ్రవరి 14: నకిలీ స్టాంపులు, జామీను పత్రాలు తయారు చేసే ముఠాను వెంకటగిరి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నకిలీ స్టాంపులు, వాటి తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గూడూరు డీఎస్పీ వెంకటరామిరెడ్డి బుధవారం మీడియాకు వెల్లడించారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం చౌటపాళెం గ్రామానికి చెందిన కోడివేటి రమేష్ జిల్లాలోని పలు కోర్టుల్లో బెయిలు పొందిన నిందితులకు నకిలీ జామీను పత్రాలు తయారు చేసిచ్చి అధిక మొత్తంలో డబ్బులు గుంజేవాడు. వెంకటగిరి ఎస్ఈబీ అధికారులు పెట్టిన ఓ గంజాయి కేసులో అరెస్టయిన కేరళ రాష్ట్రానికి చెందిన షాధీనదామస్‌కు నెల్లూరు ఏడీజే కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. జామీను పత్రాల కోసం ఇతని బంధువులు నెల్లూరులోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న రఫూర్‌ని సంప్రదించారు. అతను వెంకటాచలం మండలం చౌటపాళెం గ్రామానికి చెందిన రమేష్‌ను కలిసి గంజాయి కేసులో జామీను కావాలని చెప్పాడు. ఇందుకోసం కొంత నగదు అందజేశాడు. రమేష్ చింతలపాళెం గ్రామానికి చెందిన నలబాలు కోటేశ్వరరావు, మందా పరిశుద్ధ కలసి ఈ నెల 9వ తేదీన నిందితుడికి జామీను పత్రాలు అందజేశారు. వాటిని కోర్టులో అందజేయగా అవి పత్రాలు నకిలీ పత్రాలుగా గుర్తించిన న్యాయస్థానం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రమేష్, నలబాలు కోటేశ్వరరావు, మందా పరిశుద్ధతో పాటు నకిలీ పత్రాలు, స్టాంపులు తయారు చేసిన నెల్లూరుకు చెందిన సయీద్ అబ్దుల్, బుద్ధినాదేళ్ల నరిసింహులును అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నకిలీ స్టాంపు పేపర్లు, వాటిని తయారు చేసే పరికరాలను స్వాధీనం చేసుకోని కోర్టుకు అప్పజెప్పారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన వెంకటగిరి సీఐ, ఎస్ఐలను డీఎస్పీ అభినందించారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహిస్తాం: కలెక్టర్



రాజకీయ పార్టీ నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశా

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలతో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ, తుది జాబితాపై అభ్యంతరాలు, ఎన్నిక సన్నద్ధతపై ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వ్యయం కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతా, చెక్ బుక్‌ను నామినేషన్ వేసే ముందురోజు లోపు కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వాటిలో సవరణలు ఉంటే సంబంధిత ఈఆర్వోలు ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుందని తెలిపారు. డీఆర్వో పెంచలకిశోర్ తుది ఓటర్ల జాబితా ప్రచురణపై క్లైంలు, అభ్యంతరాలు, ఫారం 6, 7, 8 తదితరాలపై వివరించారు. ఈఆర్వో రవిశంకర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దొంగ ఓట్లు ఒక బూత్‌లో తొలగించి మరో బూత్‌లో నమోదు: పులివర్తి సుధారెడ్డి

దొంగ ఓట్లు ఒక బూత్‌లో తొలగించి మరో బూత్‌లో నమోదు చేస్తున్నారని టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి కలెక్టర్ లక్ష్మీశాకు ఫిర్యాదు చేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయని, ఆధారాలు సమర్పించినా డెట్ ఓట్లు తొలగించలేదని ఆరోపించారు. ఓటర్ల తుది జాబితా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో భారీగా డబుల్ ఎంట్రీలు, డెత్ ఓట్లు ఉన్నాయని ఫిర్యాదు చేసినా వాటిని తొలగించలేదన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ళ స్థలాలు...
కుటుంబానికి ప్రోటోకాల్ దర్శనం.. లడ్డూ కార్డు ● ఎన్నికల వేళ తిరుపతి వైసీపీ నేత అలవికాని హామీలు

తిరుపతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఇళ్ళ స్థలాలు... కుటుంబానికి ప్రోటోకాల్‌తో శ్రీవారి దర్శనం... లడ్డూ కార్డు... టీటీడీ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల సదుపాయాల కల్పన..! వింటుంటేనే సంతోషంతో మనసు ఎక్కడో తేలిపోతోంది కదా! సరిగ్గా ఇదే అనుభూతికి లోనయ్యారు బుధవారం తిరుపతి ఏపీ ఎన్జీవో భవన్‌లో సమావేశమైన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు. ఎన్నికల వేళ రోజూ వివిధ కులాలు, మతాలు, వర్గాలు, వృత్తిదారులతో వేర్వేరుగా ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్న నగర డిప్యూటీ మేయర్, వైసీపీ ఇంఛార్జి భూమన అభినయ్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలివి. బుధవారం ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంచెలంచెల ఆందోళనకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అదే రోజు తిరుపతిలో డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి అనుకూలురైన కొందరు ఉద్యోగులు, ఎన్జీవో సంఘ నాయకులు స్థానిక ఎన్జీవో భవన్‌లో ఆత్మీయ సమావేశం ఏర్పాటుకు యత్నించారు. కొందరిని బెదిరించి, మరికొందరిని బుజ్జగించి, ఇంకొందరిని హామీలతో ఊరించి మొత్తానికి 30మందిని పోగేశారు. అభినయ్‌రెడ్డిని ఆహ్వానించారు. వారితో సమావేశమైన యువనేత టీటీడీ ఉద్యోగుల తరహాలో తిరుపతిలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ళ స్థలాలు ఇప్పిస్తామని, కుటుంబాలతో శ్రీవారిని దర్శించుకునేలా ప్రోటోకాల్ దర్శనం ఏర్పాటు చేస్తామని, లడ్డూ కార్డులు కూడా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వింటున్న ఉద్యోగులు, ఎన్జీవో సంఘ నాయకులకు మతిపోయినంత పనైంది. టీటీడీని తమ సొంత సంస్థలా భావిస్తే తప్ప ఇలాంటి హామీలు ఇవ్వడం సాధ్యపడదని ఉద్యోగ వర్గాలకే చెందిన పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యవహారం రెండు విధాలా దుమారం రేపుతోంది. టీటీడీని తమ రాజకీయ అవసరాలకు, ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకునేందుకు యత్నిస్తుండడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. మరోవైపు రాష్ట్రమంతా ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు శ్రీకారం చుడితే తిరుపతిలో మాత్రం అదే అధికార పార్టీ నేతతో కూడా ఎన్జీవో భవన్‌లోనే ఆత్మీయ సమావేశం ఎలా నిర్వహించారన్న ప్రశ్న తలెత్తుతోంది. దీనిపైనా జిల్లావ్యాప్తంగా ఉద్యోగుల నుంచీ ఎన్జీవో సంఘ నాయకులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగుల నైతిక స్థైర్యం దెబ్బ తీసేలా కొందరు ఉద్యమ నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.



తిరుపతి ఎన్జీవో భవన్‌లో ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

రేపటి రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి
ఉదయం నుంచి రాత్రి వరకు వాహన సేవలు

తిరుమల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సూర్య జయంతి సందర్భంగా శుక్రవారం తిరుమలలో జరగనున్న రథసప్తమికి టీటీడీ ఏర్పాట్లు పూర్తిచేసింది. వేకువజాము నుంచి రాత్రి వరకు శ్రీవారు ఏడు వాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. భక్తులు కూర్చునే గ్యాలరీలపై తాత్కాలిక షెడ్లు నిర్మించారు. తాగునీరు, మరుగుదొడ్లను సిద్ధం చేశారు. ఎండకు ఇబ్బంది లేకుండా నేలపై కూల్ పెయింట్ వేశారు. మాడవీధుల్లో సౌందర్యవంతంగా పెయింట్‌తో ముగ్గులు వేశారు. ఇక విద్యుత్, పుష్పాలంకరణలు గురువారం రాత్రికి పూర్తి చేయనున్నారు.

దక్షిణ భారత సంగీత నృత్యోత్సవం ప్రారంభం

తిరుపతి(విద్య), ఫిబ్రవరి14: భారతీయ సంప్రదాయ కళలైన సంగీతం, నృత్యం, వాద్యకళలను ప్రోత్సహించేందుకు టీటీడీ కృషి చేస్తోందని ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో టీటీడీ ఎస్వీసంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాల ఆధ్వర్యంలో కళావైభవం పేరిట నిర్వహించిన మూడ్రోజుల దక్షిణ భారత సంగీత నృత్యోత్సం బుధవారం ప్రారంభమైంది.సాయంత్రం సంగీత కళాశాలలో సుదీర్ఘకాలం సేవలందించిన పూర్వ, ప్రస్తుత ప్రిన్సిపాళ్లను, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కోమండూరు శేషాద్రి, ఆరవేటి ప్రభావతి, పుల్లెల పేరి సోమయాజులు, చల్లా ప్రభావతి, వైవీఎస్ పద్మావతి, డాక్టర్ ఎస్.జమునారాణి, ఎం.జగన్నాథయ్య, కుమారి భ్రమరాంబ, దేవేంద్రపిళ్లై, కె.భాస్కర్, ఎం.సుధాకర్‌లను సత్కరించారు. జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన వయొలిన్ విద్వాంసురాలు కన్యాకుమారి,ఎస్వీ వేదవర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి,శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి,టీటీడీ జేఈవో వీరబ్రహ్మం,డీఈవో భాస్కర్‌రెడ్డి, ముఖ్యగణాంకాధికారి, సంగీత కళాశాల ప్రత్యేకాధికారి శేషశైలేంద్ర, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దుబాల, అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర, వాద్య, నృత్య ప్రదర్శనలు

సంగీత నృత్యోత్సంలో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన గాత్ర, వాద్య సంగీత, కూచిపూడి, భరతనాట్య, కథాకళి నృత్య ప్రదర్శనలు అదరహో అనిపించాయి. ఉదయం ఎస్వీ నాదస్వర, డోలు పాఠశాల విద్యార్థులు మంగళధ్వని వినిపించగా ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థుల వీణావాద్య కచేరితో అలరించారు.హైదరాబాద్‌కు చెందిన పొట్టి శ్రీరాములు వర్సిటీ విద్యార్థులు గాత్ర సంగీతంతో ఆకట్టుకున్నారు. సాయంత్రం ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థులు కూచిపూడి నృత్యాన్ని లయబద్ధంగా ప్రదర్శించారు. తమిళనాడులోని చిదంబరానికి చెందిన అన్నామలై వర్సిటీ విద్యార్థులు నాదకచేరి చక్కగా నిర్వహించారు. మద్రాస్ వర్సిటీ విద్యార్థుల భరతనాట్య ప్రదర్శన రక్తికట్టించింది. కేరళ రాష్ట్రం త్రిశూర్‌కి చెందిన కళామండలం అరుణ్‌రాజ్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన లవణాసుర సంవాదం కథాకళి నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది.



మాట్లాడుతున్న టీటీడీ ఛైర్మన్ కరుణాకరరెడ్డి







పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న గల్లా కుటుంబీకులు - ఆకట్టుకున్న విద్యార్థుల కళా ప్రదర్శన

పేటమిట్టలో కుంభాభిషేక మహోత్సవాలు

పూతలపట్టు, ఫిబ్రవరి 14: పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మూడో రోజైన బుధవారం ఘనంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గ్రామంతో పాటు ఆలయాల చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలంకరణ పలువురిని ఆకట్టుకుంటోంది. బుధవారం వేకువజామున గణపతి వేణుగోపాలస్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. బ్రహ్మముహూర్త సమయంలో మహాగణపతి స్వామివారి మూషిక వాహనం విగ్రహ స్థాపన జరిగింది. ఉదయం 8 గంటల నుంచి జరిగిన వేదస్వస్తి ప్రతిష్ఠమూర్తులకు శ్రీరామ సహస్రనామ హవనం, ఆంజనేయ సహస్ర హోమాలు, దర్బారు సేవ, చతుర్వేదస్వస్తి తదితర పూజా కార్యక్రమాల్లో గల్లా రామచంద్రనాయుడు, అరుణకుమారి, జయదేవ్ పాల్గొన్నారు. సాయంత్రం 7 గంటలకు నిర్వహించిన పండరి భజనలు, కోలాటాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు యువరాజులు నాయుడు, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, మాజీ కన్వీనర్ చంద్రమౌళి, నాయకులు చింతగుంపల రజినీ, బీసీ నాయకులు షణ్ముగం, గల్లా కుటుంబసభ్యులతో పాటు ట్రస్టు సభ్యులు గల్లా రామానాయుడు, భానుమూర్తి నాయుడు, స్థానికులు పాల్గొన్నారు. గురువారం ఉదయం 4 గంటల నుంచి విగ్రహప్రతిష్ఠ, అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవం జరగనున్నాయి.


గురుదక్షిణామూర్తి స్వామికి హారతులిస్తున్న వేదపండితులు

వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవార సామూహిక అక్షరాభ్యాసం వైభవంగా జరిగింది. బుధవారం వసంత పంచమి పర్వదినం పురస్కరించుకుని ముక్కంటి ఆలయంలోని మేథో గురుదక్షిణామూర్తి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. వేద పండితులు విశేష పూజల అనంతరం పిల్లల చేత అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో అయిన వారికి ఉద్యోగాలు...?

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా ఉండే వారిని వివిధ స్థానాల్లో ఉద్యోగులుగా నియమించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీకి అయినవారిని కొంతకాలంగా ఉచిత సేవకుల ముసుగులో పీఆర్‌ఓ కార్యాలయంలో పెట్టిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సుమారు 150మందిని ఒప్పంద ఉద్యోగులుగా అధికారికంగా నియమించేందుకు రహస్యంగా సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగా కంప్యూటర్ ఆపరేటర్, డ్రైవర్, అటెండర్, గోశాల సిబ్బంది తదితర విభాగాల్లో ఖాళీలకు భర్తీ చేసేలా ఫైల్ పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

రేణిగుంట అర్బన్ సీఐగా మల్లికార్జున్



రేణిగుంట,ఫిబ్రవరి14: రేణిగుంటఅర్బన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మల్లికార్జున్ ను నియమించారు. శ్రీకాళహస్తి టుటౌన్ సీఐగా పనిచేసే మల్లికార్జున్‌ను రేణిగుంట అర్బన్ సిఐగా, ఇక్కడ పనిచేసే పివిసి సుబ్బారెడ్డిని తిరుపతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈ బదిలీలు జరిగాయనే చర్చజరుగుతోంది.

జనఔషధి మెడికల్ షాప్ ప్రారంభం

తొట్టంబేడు, ఫిబ్రవరి 14: శ్రీకాళహస్తి పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ మండల పీఏపీయస్ కార్యాలయంలో బుధవారం జనఔషధి మెడికల్ షాప్‌ను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసియస్ చైర్మన్ చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు క్రిష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు

కుంభాభిషేకానికి అంకురార్పణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకంలో భాగంగా అంకురార్పణ చేశారు. ఇటీవల ఆలయానికి జీర్ణోదరణ పనులు పూర్తి చేశారు. గురువారం జరగబోయే కుంభాభిషేకంలో భాగంగా బుధవారం శాస్త్రోక్తంగా సంకల్పం పూజలతో అంకురార్పణ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, ఉప ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి, వేద పండితులు, అర్చకులు, పరిచారకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని శ్రీకాళహస్తి తాలూకా ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రెసిడెంట్ చెంచు రత్నం యాదవ్ అన్నారు. పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా చెంచరత్నం యాదవ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. రాష్ట్ర జేఏసీ ఉద్యమ కార్యాచరణకు పిలుపు మేరకు బుధవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు భోజనం సమయంలో నిరసన ప్రదర్శించారని తెలిపారు.

ఏపీ జేఏసీ ఉద్యమబాట


నల్ల బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరైన ఆర్టీసీ ఉద్యోగులు

సత్యవేడు, ఫిబ్రవరి 14: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పోరాటం కోసం ఏపీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీ జేఏసీ సత్యవేడు తాలూకా చైర్మన్ లలిత్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లలిత్‌కుమార్ మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. అదే విధంగా స్థానిక ఆర్టీసీ డిపోలో ఏపీ జేఏసీ, ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగసమస్యలపై సత్యవేడు ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరై నిరసన తెలియజేశారు.

వీఆర్ఏల రిలే దీక్షలను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏలు) సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఐటీయు ఆధ్వర్యంలో ఈ నెల 18, 19,20వ తేదీల్లో విజయవాడ వేదికగా చేపడుతున్న రిలే దీక్షలను జయప్రదం చేయాలని వీఆర్ఏల సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బయ్య పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం వీఆర్ఏల సంఘం నాయకులు సమావేశమయ్యారు. వీఆర్ఏలపై పని భారం మోపుతూ వారికి కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వమని కోరితే జగన్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మండిపడ్డారు. వీఆర్ఏల సంఘం నాయకులు చుక్కల కృష్ణయ్య, అంకయ్య, శిరీష, రామ్మూర్తి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓర్పుతో వాహనాలు నడపాలి: ఎంవీఐ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: వాహనాలు నడిపే సమయం లో ప్రతి ఒక్కరు ఓర్పుతో వ్యవహరించాలని శ్రీకాళహస్తి మోటారు వాహనాల తనిఖీ అధికారి దామోదర్ నాయుడు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డీఎం రాజు వర్ధన్ ఆధ్వర్యంలో బుధవారం ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన దామోదర్ నాయుడు మాట్లాడుతూ... ట్రాఫిక్ నిబంధనలను అందరూ విధిగా పాటించాలన్నారు. ఆర్టీసీ డిపో పరిధిలో డ్రైవర్లకు నగదు రివార్డును ప్రకటించగా, వెంకటేష్, జీవి సుబ్బయ్య, నాగరాజు అనే ముగ్గురు డ్రైవర్లు దామోదర్ నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధికారి చక్రవర్తి, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఏర్పేడు, ఫిబ్రవరి 14: మండలంలోని మునగలపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షిక క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేణునాయుడు, గణపతి, ప్రధానోపాధ్యాయులు రాజవేలు, వ్యాయామ ఉపాధ్యయులు జయచంద్ర, పాఠశాల కమిటీ చైర్మన్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

'పార్సన్' సహకారంతో అంగన్‌వాడీ భవనం


అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న పార్సన్, శ్రీసిటీ ప్రజాప్రతినిధులు

శ్రీసిటీ, ఫిబ్రవరి 14: శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో(సీఎస్ఆర్) భాగంగా శ్రీసిటీలోని పార్సన్ ప్యాకేజింగ్ పరిశ్రమ యాజమాన్యం మండలంలోని మల్లవారిపాళెం వెస్ట్ గ్రామంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని బుధవారం ప్రారంభించి, అంగన్‌వాడీ సిబ్బందికి అందజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్సన్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ సెంథిల్, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి నిరీషా, పార్సన్ ఫైనాన్స్ హెడ్ సంతోష్, హెచ్ఆర్ మేనేజర్ ప్రభుచందర్, శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, మల్లవారిపాళెం గ్రామస్తులు పాల్గొన్నారు. నూతన భవనంతో పాటు అదే ఆవరణలోని పాత అంగన్‌వాడీ భవనం, మరుగుదొడ్లకు రూ.18.5 లక్షలతో మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చారు. వితరణ పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో పార్సన్ పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు.

జగన్ జంతర్‌మంతర్‌కు కాలం చెల్లింది

● మాజీ సర్పంచ్ పద్దురాజు


అడవిశంకరాపురంలో బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 14: సీఎం జగన్ జంతర్ మంతర్ డ్రామాలకు కాలం చెల్లిందని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మాజీ సర్పంచ్ పద్దురాజు విమర్శించారు. బుధవారం మండలంలోని అడవిశంకరాపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లతో మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు వెల్లువలా వస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ జయకేతనానికి ఇది నిదర్శనమన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు మనీయాదవ్, చంద్రబాబు, ఎం.ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో బీజేపీ కార్యాలయం



రేణిగుంట,ఫిబ్రవరి14: రాష్ట్రంలో జరుగన్ను ఎన్నికలను దృష్టిలోవుంచుకొని భారతీయ జనతా పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌చార్జ్ కోలా ఆనంద్ బుధవారం రేణిగుంటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బీజేపీ నాయకులు ఎం సుబ్రమణ్యం రెడ్డి, జె.తేజోవతి, ఎల్.చంద్రారెడ్డి, జె.క్రిష్ణారెడ్డి, రాజారాయల్, ప్రేమ్‌కుమార్ రెడ్డి,అన్నపూర్ణమ్మ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జేబీఎన్పీ కోఆర్డినేటర్‌గా నిరంజన్ రెడ్డి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: జై భారత్ నేషనల్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామానికి చెందిన రొమ్మాల నిరంజన్ రెడ్డి నియమితులయ్యారు. జేబీఎన్పీ అధినేత లక్ష్మీనారాయణ విజయవాడలో బుధవారం నిరంజన్ రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. నిరంజన్ రెడ్డి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి జై భారత్ నేషనల్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారని తెలిపారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 14: బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సత్యవేడు ఐసీడీఎస్ సీడీపీవో దవేకుమారి అన్నారు. వరదయ్యపాళె మండలంలోని బత్తలవల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఎస్టీయూ కార్యవర్గంలో ముగ్గురికి చోటు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 14: ఎస్టీయూ జిల్లా కార్యవర్గంలో వరదయ్యపాళెం మండలం నుంచి ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అందులో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పృధ్వి ఆదిశేషయ్య, జిల్లా మైనార్టీ కన్వీనర్‌గా మల్లామ్ ముజీబ్, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడిగా శ్యామ్‌సుందర్‌ను ఎన్నుకున్నారు. పలువురు వారికి అభినందనలు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం: డీఎస్పీ


బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: శాంతి భద్రతల పరిరక్షణ తన లక్ష్యంగా పనిచేస్తానని శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వర రెడ్డి అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు సబ్ డివిజన్ డీఎస్పీగా పనిచేస్తున్న ఉమామహేశ్వర రెడ్డిని ఇటీవల శ్రీకాళహస్తికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం మొదట ముక్కంటిని దర్శించుకుని అనంతరం డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని, ఇంతటి ప్రధాన క్షేత్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అలాగే మరో రెండు వారాల్లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను కట్టుదిట్టంగా నిర్వహిస్తామన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, నూతన డీఎస్పీకి ఘనంగా స్వాగతం పలికారు.

ముక్కంటి సేవలో జస్టిస్ నాగార్జున రెడ్డి


స్వామి అమ్మవార్ల చిత్రపటం అందుకుంటున్న జస్టిస్ నాగార్జున రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: ముక్కంటి ఆలయాన్ని ఎలక్ట్రిసిటీ బోర్డ్ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం ఇచ్చారు. చైర్మన్ స్వామి అమ్మవార్ల చిత్రపటం బహూకరించారు.

బంగారు చైను అప్పగింత

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 14: ముక్కంటి ఆలయంలో భక్తులు జారవిడుచుకున్న బంగారు గొలుసును పర్సుతో సహా తిరిగి అప్పగించారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన శ్రీనివాసరావు దంపతులు బుధవారం ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. క్యూలైన్లో పర్సు పోగొట్టుకున్నారు. అదే సమయంలో విధుల్లో ఉన్న ఆలయ తనిఖీదార్ హరి యాదవ్ పర్సు గుర్తించారు. బంగారు చైన్‌తో పాటు రూ.3వేల నగదు ఉందని గమనించి చైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అందజేశారు. సరైన ఆధారాలతో వచ్చిన శ్రీనివాసరావు దంపతులకు ఎస్పీఎఫ్ పోలీసుల సమక్షంలో తిరిగి అందజేశారు. 32 గ్రాముల బంగారు చైను తిరిగి అందజేసినందుకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల్లో నిర్మాణ పనులకు భూమి పూజ


శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: ముక్కంటి అనుబంధ ఆలయాల్లో పలు నిర్మాణ పనులకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. ఇందులో భాగంగా ఏడు గంగమ్మ ఆలయ పునర్నిర్మాణం, విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పునర్నిర్మాణం, ధర్మరాజు స్వామి ఆలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి బంద్‌ను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: కేంద్రంలోని బీజేపీ, ఆంధ్ర రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. బుధవారం శ్రీకాళహస్తిలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు గుడ్లూరు భారతి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని కార్మికులు, రైతులు, ప్రజల పట్ల అనుసరిస్తున్న వైఖరి దారుణంగా ఉందన్నారు. కేవలం కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తూ వారికి అనుకూల నిర్ణయాలను చేస్తోందని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకులు చేస్తున్న పోరాటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఏఐ కేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకయ్య మాట్లాడుతూ 2014లో స్వామినాథన్ కమిషన్ ఇచ్చిన నివేదికలో ఎంఎస్‌పి అమలు చేయాలని కోరినా ఇప్పటివరకు బీజేపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సీపీఎం పార్టీ డివిజన్ నాయకుడు గంధం మణి మాట్లాడుతూ విద్యుత్ రంగం ప్రైవేటీకరణ దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, సీపీఐ నియోజికవర్గ కార్యదర్శి జనామాల గురవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం తులసి రాజన్, శ్రీకాళహస్తి ఏఐటీయుసి కార్యదర్శి మణి, శోభ, శాంతకుమారి, వసంత, మోహన్ నాయుడు, శివ, దినేష్, సూరి, గురవయ్య, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి: సీపీఎం, సీపీఐ

సత్యవేడు, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న(శుక్రవారం) చేపట్టనున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ని జయప్రదం చేయాలని సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు రమేష్, తరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మె నిర్వహణపై బుధవారం సత్యవేడులో స్థానిక సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చంద్రబాబు, మునిచంద్ర, సీఐటీయూ నాయకురాలు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పెత్తందారీపై తిరుగుబాటు ప్రారంభం


మీడియాతో మాట్లాడుతున్న దశరధాచారి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: సీఎం జగన్మోహన్ రెడ్డి నియంతృత్వ పాలనతో అణచివేతకు గురై తమ మాన ప్రాణాలను కోల్పోయిన బడుగు బలహీన వర్గాల తిరుగుబాటు తప్పదని టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి అన్నారు. ముగ్గురు జడ్పీటీసీలు వైసీపీని వీడటంపై బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర రాష్ట్రాన్ని కాస్తా అరాచక ఆంధ్రప్రదేశ్‌గా మార్చేసిన సీఎం జగన్‌కు బడుగులు గుణపాఠం చెప్పడానికి సిద్ధం అయిపోయారని దశరధాచారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్ రవి, బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, బీసీ విభాగం నాయకులు రామచంద్రయ్య, మునిరాజా యాదవ్, బీమాల భాస్కర్ ముదిరాజ్, చిల్లకూరు మణి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 14: మండలంలోని కుక్కంబాకం, కల్లివేట్లు సచివాలయాలలో జగనన్న గృహ లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ల ప్రకియ శరవేగంగా జరుగుతుందని గ్రామ కార్యదర్శి నందిని తెలిపారు.

రాజేష్‌ను గెలిపించుకురండి

సత్యవేడు వైసీపీ శ్రేణులకు పెద్దిరెడ్డి ఆదేశం


మంత్రి పెద్దిరెడ్డి ఎదుట చేతులు కట్టుకుని నిల్చున్న సత్యవేడు వైసీపీ నాయకులు

సత్యవేడు, ఫిబ్రవరి 14: నియోజకవర్గంలో మారిన రాజకీయ సమీకరణల వల్లే అభ్యర్థి మార్పాం.. ఎవరికి వారుగా గ్రూపులు కట్టి పార్టీకి నష్టం వాటిల్లేలా చర్యలు చేపడితే సహించేది లేదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సత్యవేడు వైసీపీ నాయకులకు గట్టిగా క్లాస్ పీకినట్లు తెలిసింది. వైసీపీ అధిష్ఠానం విడుదల చేసిన 5వ జాబితాలో సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా నూకతోటి రాజేష్ పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు అభ్యర్థులను మార్చడం ఆ పార్టీ నాయకులు క్యాడర్‌లో గందరగోళం పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో నూతన అభ్యర్థిగా రాజేష్ పేరు ప్రకటించినా కూడా పదిరోజుల వరకు నియోజకవర్గానికి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో మళ్లీ అభ్యర్థిని మారుస్తున్నారన్న ప్రచారం జోరుగా జరిగింది. దీంతో షాక్ తిన్న వైసీపీ అధిష్ఠానం రాజేష్‌ని రెండు రోజుల క్రితం హుటాహుటిన నియోజకవర్గ పర్యటనకు పంపించింది. అయితే వైసీపీ అభ్యర్థి రాజేష్ తొలి సారిగా నియోజకవర్గ పర్యటనకు వచ్చినా కూడా శ్రేణుల నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గ నాయకులను బుధవారం తిరుపతిలోని తన కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడినట్లు తెలిసింది. రాజేష్ అభ్యర్థిత్వంలో ఇక ఎలాంటి మార్పు ఉండబోదని, అందరూ ఆయన కోసం పని చేసి గెలిపించాలని దిశ నిర్దేశం చేసినట్లు సమాచారం.

తగ్గిన జోష్...

సత్యవేడు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా గురుమూర్తిని ప్రకటించినప్పుడు గత నెల 26న తిరుపతి పీఎల్ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఆత్మీయ భేటికి హాజరైన వైసీపీ కేడర్‌లో కనిపించినంత జోష్, బుధవారం నిర్వహించిన సమావేశంలో కనిపించలేదు. వైసీపీ నాయకులు డీలా పడినట్లు, కనిపించడం గమనార్హం. అయితే పెద్దిరెడ్డి ఆదేశాలను చేతులు కట్టుకుని వినయంతో తల ఊపిన మెజారిటీ నాయకుల్లో అసంతృప్తి మాత్రం ఇంకా వీడలేదన్న గుసగుసలు వినబడుతున్నాయి. పెద్దిరెడ్డి మంత్రాంగం ఏ మేరకు ఫలిస్తుందో వేచి చూడాల్సిందేనని రాజకీయ విశ్లేషకులు చెప్పుకుంటున్నారు.

కార్బన్ బ్లాక్ పరిశ్రమకు శంకుస్థాపన


పరిశ్రమల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: రాష్ట్రప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తోందని మంత్రి గుడివాడ అమరనాథ్ తెలిపారు. బుధవారం విజయవాడ నుంచి ఆయన జిల్లాలో రెండు పరిశ్రమలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి మాట్లాడుతూ నాయుడుపేట స్పెషల్ జోన్‌లో ఆదిత్యబిర్లా గ్రూప్ రూ.1,198కోట్లతో నెలకొల్పనున్న కార్బన్ బ్లాక్ తయారీ యూనిట్ ద్వారా 250మందికి ఉపాధి లభించనుందన్నారు.అలాగే హెల్లా ఇన్ఫ్రా రూ.350 కోట్లతో ఏర్పాటు చేయనున్న పీవీసీ పైప్స్, పిట్టింగ్ తయారీ ద్వారా 35మందికి ఉపాధి కలుగుతుందన్నారు. అలాగే వైజాగ్-చెన్నై కారిడార్‌లో రూ.423 కోట్లతో శ్రీకాళహస్తి-చిత్తూరు సౌత్ క్లస్టర్ స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు ద్వారా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ తదితరాల ఏర్పాటుకు భూమిపూజ చేశారు.సంబంధిత పరిశ్రమల ప్రతినిధులతో కలిసి జిల్లాపరిశ్రమల శాఖ అధికారి ప్రతాపరెడ్డి, ఏపీఐఐసీ జడ్‌ఎం చంద్రశేఖర్, తిరుపతి స్పెషల్‌జోన్ అధికారి విజయరత్నం పాల్గొన్నారు.

ఉద్యోగులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

● రుయాస్పత్రి ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన


నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీఎన్జీవోస్ జిల్లా సహాధ్యక్షుడు నైనారు వరప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీఎన్జీవోస్, ఏపీజేఏసీ తలపెట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం రుయాస్పత్రిలో అధికారులు, ఉద్యోగులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన ఐఆర్‌ను వెంటనే విడుదల చేయడంతోపాటు హెల్త్ కార్డులను అందించాలన్నారు. అలాగే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్నట్లు ఇచ్చిన ప్రకటనను వెంటనే అమలు చేయాలని కోరారు. లేకపోతే చలో విజయవాడ తరహా ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీ రత్నరాజు, ఉద్యోగులు గిరిప్రసాద్, ఫణిభూషన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ జ్యోతి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ జ్యోతి కోరారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఒకరోజు సెమినార్ కమ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని తిరుపతిలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించారు. పీఎం విశ్వకర్మ పథకం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథరెడ్డి, డీఐసీ డిప్యూటీ డైరెక్టర్ మురళి పాల్గొన్నారు.

లక్ష్యాల మేరకు గ్రౌండింగ్ వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: లక్ష్యాల మేరకు గ్రౌండింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ లక్ష్మీశా అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, వీసీఐసీ తిరుపతి స్పెషల్ జోన్‌లో పరిశ్రమలకు సంబంధించిన అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. సింగిల్ విండోలో పరిశ్రమలకు ప్రభుత్వం త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తోందని, పెండింగ్ ఉండరాదని అధికారులను ఆదేశించారు. పీఎం విశ్వకర్మ అప్లికేషన్ల రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్, విజయరత్నం పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పనులు వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం భూమిని గుర్తించే పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా జర్నలిస్టు హౌసింగ్ కమిటీ సభ్యులతో, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జర్నలిస్టుల ఇళ్లస్థలాల కోసం భూమిని గుర్తించి, శనివారం లోపు నివేదికలు అందించాలని ఆదేశించారు. అదే సమయంలో 590మందితో కూడిన జర్నలిస్టుల జాబితాను సంబంధిత రెవెన్యూ డివిజనల్, మండల రెవెన్యూ అధికారులు వారి లాగిన్‌లో వెరిఫై చేసే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు నిశాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కమిటీ కన్వీనర్ సమాచార సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, జర్నలిస్టు హౌసింగ్ కమిటీ సభ్యులు శుక్లా, మోహన్, ప్రసాద్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


షారున్ ప్రియా అలగ్జాండర్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 14 : స్విమ్స్ యూనివర్సిటీ పరిధిలోని బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో పరిశోధనలు చేసిన షారున్ ప్రియా అలగ్జాండర్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) పట్టాను ప్రదానం చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరి పర్యవేక్షణలో ఆమె పొటెన్షియల్ డ్రగ్ టార్గెట్ ఐడెంటిఫికేషన్ అండ్ ఇన్ హెబిటర్ డిజైన్ ఫర్ హ్యూమన్ బ్రెస్ట్ క్యాన్సర్ త్రూ ట్రాన్స్ క్రిప్టోమిక్ అనాలసిస్ అనే అంశంపై పరిశోధనలు చేసిన గ్రంథాన్ని యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ వారికి సమర్పించారని పేర్కొన్నారు.

కార్మికుల స్థలాల్లో అక్రమ నిర్మాణాలు అన్యాయం


మాట్లాడుతున్న సింధూజ

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 14 : కార్మికులకు ఇచ్చిన స్థలాల్లో తుడా అధికారులు అక్రమ నిర్మాణాలు చేపట్టడం చట్టవ్యతిరేకమని, వెంటనే ఆపి ఆ స్థలాలను కార్మికులకు అప్పగించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబూరు సింధూజ పేర్కొన్నారు. గతంలో వెల్డింగ్ షాపులకు కేటాయించిన దుకాణ స్థలాల్లో తుడా అధికారులు నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్‌లను నిలిపేయాలని కోరారు. శ్రీవెంకటేశ్వర ఫ్యాబ్రికేటర్స్ అసోసియేషన్ సభ్యులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొని మద్దతు తెలిపారు. ఆమె మాట్లాడుతూ వెల్డింగ్ కార్మికులకు ఇచ్చిన స్థలాలకు సంబంధించి కోర్టు స్టే ఉన్నప్పటికీ తుడా అధికారులు కోర్టు ఆదేశాలను ధిక్కరించి అక్రమ నిర్మాణాలు చేపట్టడం అన్యాయమన్నారు.

స్పెయిన్ అమ్మాయి.. గుంతూరు అబ్బాయి



ఆంద్రియ.. స్పెయిన్ అమ్మాయి. భాష్యం అఖిల్.. బంగారుపాళ్యం మండలం గుంతూరుకు చెందిన అబ్బాయి. రిటైర్డు డీఎస్‌డీవో సుదర్శన్‌నాయుడు కుమారుడైన ఇతడు జర్మనీలో ఎమ్మెస్సీ చదువుతున్నాడు. అక్కడి యూనివర్సిటీలో యోగా టీచరుగా పనిచేస్తున్న ఆంద్రియాతో పరిచయమైంది. ఆ పరిచయం పెళ్లి పీటల వరకు చేరింది. బుధవారం కాణిపాకంలోని ఆలయంలోని హిందూ సంప్రదాయం ప్రకారం వీరి వివాహం జరిగింది. ఆంద్రియ తల్లిదండ్రులు, బంధువులు హాజరయ్యారు.

- బంగారుపాళ్యం

ఎన్‌ఎస్‌యూలో వీరసైనికులకు నివాళి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 14: జమ్ముకాశ్మీర్‌లోని పుల్వామా దాడిలో వీరమరణం పొందిన భారత సైనికులకు బుధవారం తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో నివాళి అర్పించారు. వర్సిటీలోని భరతమాత విగ్రహం వద్ద విద్యార్థులతో అధ్యాపకులు కలసి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని పెంచుకోవాలని ఆకాంక్షించారు.

సమస్యలను పరిష్కరించండి

తిరుమల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఆర్టీసీ డిపోలో సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు డిపో మేనేజర్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. యాక్సిడెంట్ కేసులను వెంటనే పరిష్కరించడంతో పాటు డిపోలో తక్కువగా ఉన్న కంట్రోలర్స్, ఏడీసీలను నియమించుకోవాలని కోరారు. డిపోలో పనిచేసే సిబ్బందికి నెలకు రెండు రోజులు పురుషులకు, మూడు రోజులు మహిళలకు సెలవులు ఇవ్వాలని కోరారు. టీటీడీ ఎంప్లాయిస్ క్యాంటీన్‌లో భోజన వసతి కల్పించాలని విన్నవించారు. ఇలా దాదాపు 27 సమస్యలపై నివేదిక తయారు చేసి డిపో మేనేజర్ కార్యాలయం సిబ్బందికి అందజేశారు.




సుధహో స్కూల్‌లో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న డైరెక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, టీచర్లు - ఎస్వీ జూనియర్ కళాశాలలో సరస్వతీదేవికి పూజచేస్తున్న ప్రిన్సిపాల్ ప్రకాశ్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు - వేదవర్సిటీలో నిర్వహించిన వసంతపంచమిలో వీసీ రాణీసదాశివమూర్తి తదితరులు

విద్యాలయాల్లో వైభవంగా వసంత పంచమి

తిరుపతి(విద్య),ఫిబ్రవరి14: తిరుపతిలోని పలు విద్యాలయాల్లో వసంత పంచమిని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● సుధహో స్కూల్‌లో: ఆర్‌సీ రోడ్డులోని సుధహో లిటిల్ సిటిజన్స్ హైస్కూల్‌లో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిచారు. విద్యార్థులతో బీజాక్షరి దిద్దించారు. డైరెక్టర్ జోగిరెడ్డి రాజేంద్రప్రసాద్‌రెడ్డి, హెచ్‌ఎం నందన, టీచర్లు పాల్గొన్నారు.

● ఎస్వీ జూనియర్ కాలేజీలో: టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సిప్రకాశ్‌బాబు నేతృత్వంలో సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కాంక్షిస్తూ సరస్వతిదేవిని అష్టోత్తరశతనామావళిని పఠించారు. అధ్యాపకులు ప్రియవర్ధన్‌బాబు, గంగాధరరావు, కృష్ణకిశోర్, కేవీరమణమ్మ, వాసుదేవులనాయుడు, చెన్నారెడ్డి, ప్రసన్నలక్ష్మి, సోమశేఖర్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

● వేదవర్సిటీలో: ఎస్వీవేదవర్సిటీలోని పరిపాలనా భవనంలో సరస్వతిదేవి ఆరాధన నిర్వహించారు. వీసీ రాణీసదాశివమూర్తి మాట్లాడుతూ విద్యార్థులందరూ సరస్వతిదేవి అనుగ్రహంతో విద్యాబుద్ధులు, జ్ఞానాన్ని పొందాలని, సరస్వతీదేవి రూపాలైన వేద శాస్త్ర ఆగమపండితులకు సన్మానం చేసుకోవడం మన కర్తవ్యమని తెలిపారు. తిరుపతికి చెందిన వేద, శాస్త్రపండితులు బ్రహ్మశ్రీ మద్దూరి ఆంజనేయ సోమయాజీ, వైఖానసాగమ పండితులు గోవిందరాజ దీక్షితులు, శాస్త్రవేదాంగ పండితులు బ్రహ్మశ్రీ కూచిబట్ల సీతారామాంజనేయ అవధానిని సన్మానించారు. రిజిస్ట్రార్ ఆర్‌జీ త్రిపాఠి, అకడమిక్ డీన్ గోళి సుబ్రహ్మణ్యశర్మ, సుబ్రహ్మణ్యబిడే, ఆర్‌వీ సత్యనారాయణాచార్యులు, వీఆర్వో డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

● ఎస్జీఎస్ కళాశాలలో: ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో సరస్వతిదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యార్థులకు ఆశీర్వచనాలు అందించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రథసప్తమి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి


రథసప్తమి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14: శ్రీవారి రథసప్తమి సందర్భంగా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ పోలీసు అధికారులను ఆదేశించారు. రథసప్తమి ఏర్పాట్లపై బుధవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా ఏర్పాట్లు ఉండేలా చూడాలన్నారు. డాగ్ స్క్వాడ్, స్పెషల్ పార్టీలు, బీడీ టీమ్‌లతో నిరంతరం తిరుమల, పరిసరాలు, ఘాట్ రోడ్లలో తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని ఆదేశించారు. ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, తిరుమల శివరామిరెడ్డి, సెబ్ రాజేంద్ర, ఎస్బీ డీఎస్పీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె పోలీసుల అత్యుత్సాహం

● టీడీపీ నాయకుడి 745 కుక్కర్లు సీజ్
● తన తల్లి సంవత్సరీకానికి పంపిణీ చేయాలని ప్రణాళిక
● ఇంతలోనే తీసుకెళ్లిపోయిన పోలీసులు
● పూతలపట్టు నియోజకవర్గానికి విస్తరిస్తున్న పుంగనూరు సంస్కృతి


కుక్కర్లను ట్రాక్టరులోకి లోడ్ చేయిస్తున్న పోలీసులు

చిత్తూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ఓటర్లను ప్రభావితం చేసే పంపిణీ కార్యక్రమాలను అభ్యర్థులు చేయకూడదు. కానీ, ఇప్పుడు కోడ్ అమల్లోకి రాలేదు. ఆయన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థీ అంతకంటే కాదు. తన తల్లి జ్ఞాపకార్థం ఓ కార్యక్రమాన్ని నిర్వహించి కుక్కర్లను పంపిణీ చేయాలనుకున్నారు. అది పోలీసులకు నచ్చలేదు. అతను తెచ్చిపెట్టుకున్న 745 కుక్కర్లను స్టేషన్‌కు తీసుకెళ్లిపోయారు. ఆ తెప్పించిన వ్యక్తి టీడీపీ నాయకుడు కావడమే దీనికి కారణంగా తెలుస్తోంది.

తవణంపల్లె మండలం తెల్లగుండ్లపల్లె సర్పంచి మాధవి భర్త, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌నాయుడు తల్లి మరణించి ఏడాది అవుతోంది. మూడు రోజుల్లో సంవత్సరీకాన్ని నిర్వహించి అందరికీ భోజనాలు పెట్టాలని, హాజరైన వారందరికీ కుక్కర్లు పంపిణీ చేయాలని భావించారు. దీనికోసం రెండు రోజుల కిందట 745 కుక్కర్లను చెన్నై నుంచి కొని తెచ్చుకున్నారు. కుక్కర్ల మీద టీడీపీ లోగోలు, పసుపు రంగు స్టిక్కర్లు వంటివి లేవు. ఈ సమాచారాన్ని అందుకున్న చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, తవణంపల్లె ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి బుధవారం మోహన్‌నాయుడు ఇంట్లో సోదాలు చేశారు. ఇంటి సమీపంలోని గోడౌన్‌లో ఉన్న కుక్కర్లను స్టేషన్‌కు తరలించారు. అమ్మ జ్ఞాపకార్థం పంపిణీ చేసేందుకు తెచ్చుకున్నానని చెప్పినా పోలీసులు వినకుండా తీసుకెళ్లిపోయారని మోహన్‌నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కర్ల మీద పార్టీ ప్రచార స్టిక్కర్లు లేకపోయినా పోలీసులు ఇలా కక్ష సాధించడం దారుణమంటున్నారు.

ఈ పంపిణీల మాటేమిటి?

సంక్రాంతి, దీపావళి వంటి పండుగలకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజకవర్గంలోని ప్రజలకు కానుకలను పంపిణీ చేస్తుంటారు. ఇటీవల ఆయన ప్రతి ఇంటికీ కుక్కర్లను అందజేశారు. చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి కూడా జనవరి ఒకటో తేదీన పెద్దఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. చిత్తూరు టీడీపీ నేత గురజాల జగన్మోహన్ తన పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలోని 50 వేల కుటుంబాలకు సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ రానంతవరకు రాజకీయ నాయకులు, అభ్యర్థులు ఇలాంటి పంపిణీలు చేపట్టడం సర్వసాధారణంగా మారింది. వాళ్లంతా పంపిణీ చేసేటప్పుడు పోలీసులెవ్వరూ వెళ్లి దాడులు చేయలేదు. బిల్లులు అడగలేదు. సామగ్రిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించలేదు. కానీ, తవణంపల్లె పోలీసులు మాత్రం.. టీడీపీ నేత వ్యక్తగత ఫంక్షన్‌లో పంపిణీకి తెప్పించిన కుక్కర్లను సీజ్ చేయడం విమర్శలకు తావిస్తోంది.

ఇక్కడా.. పుంగనూరులా!

ఇటీవల పుంగనూరులో బీసీవై అధినేత రామచంద్రయాదవ్ తమ పార్టీ కార్యకర్తలు, పార్టీ వలంటీర్లకు బహుమతిగా అందజేసేందుకు తెప్పించిన గోడ గడియారాలనూ అక్కడి పోలీసులు సీజ్ చేశారు. వీటితో పాటు కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఉన్నాయని కేసులు పెట్టిన విషయం తెలిసిందే. పుంగనూరు నియోజకవర్గంలో ప్రతిపక్షాలుఎవరు ఎలాంటి సేవా కార్యక్రమాలు చేసినా.. ఏ వస్తువు పంపిణీ చేయాలన్నా పోలీసులు రంగంలోకి దిగుతారు. వాటన్నింటిని సీజ్ చేస్తారు. తవణంపల్లెలోని కుక్కర్ల సీజ్‌తో.. పుంగనూరు సంస్కృతి పూతలపట్టు నియోజకవర్గానికీ పాకింది.

రేపటి రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి

ఉదయం నుంచి రాత్రి వరకు వాహన సేవలు

తిరుమల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సూర్య జయంతి సందర్భంగా శుక్రవారం తిరుమలలో జరుగనున్న రథసప్తమికి టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. వేకువజాము నుంచి రాత్రి వరకు శ్రీవారు ఏడు వాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. భక్తులు కూర్చునే గ్యాలరీలపై తాత్కాలిక షెడ్లు నిర్మించారు. తాగునీరు, మరుగుదొడ్లను సిద్ధం చేశారు. ఎండకు ఇబ్బంది లేకుండా నేలపై కూల్ పెయింట్ వేశారు. మాడవీధుల్లో సౌందర్యవంతంగా పెయింట్‌తో ముగ్గులు వేశారు. గ్యాలరీల్లోని భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, టీ, కాఫీ, పాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అర్ధ బ్రహ్మోత్సవంగా చెప్పుకునే రథసప్తమి రోజున గోవిందుడి వైభవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరానున్నారు. ఇక విద్యుత్, పుష్పాలంకరణలు గురువారం రాత్రికి పూర్తి చేయనున్నారు.

అభివృద్ధి చేస్తున్నా.. ఆశీర్వదించండి

యూనివర్సిటీ ఉద్యోగులతో భూమన అభినయ్


సమావేశంలో పాల్గొన్న భూమన అభినయరెడ్డి

తిరుపతి, ఆంధ్రజ్యోతి, ఫిబ్రవరి 14: తిరుపతిని అభివృద్ధి చేస్తున్నా.. ఎమ్మెల్యేగా ఓటు వేసి ఆశీర్వదించండి అంటూ యూనివర్సిటీ ఉద్యోగుల సమావేశంలో తిరుపతి వైసీపీ ఇన్‌చార్జి భూమన అభినయ్‌రెడ్డి కోరారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలోని శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో బుధవారం యూనివర్సిటీ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. తిరుపతిని ఎంతో అభివృద్ధి చేస్తున్నానన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ రోడ్లు వేసినట్టు తెలిపారు. తిరుపతిని మరింత అభివృద్ధి చేసేందుకు అందరూ తోడ్పడాలని కోరారు. ఇప్పటికే ఉద్యోగుల సమస్యలన్నింటినీ యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, వీలైనంత త్వరగా పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో డిప్యూటీ సీఎం వీరభద్రస్వామి, తెనాలి ఎమ్మెల్యే శివకుమార్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎలెన్ విద్యార్థుల విజయకేతనం



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 14: ఎన్టీఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్‌లో తిరుపతిలోని ఎలెన్ కేరీర్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ మార్కులు పొంది విజయకేతనం ఎగురవేశారని సంస్థ సెంటర్ హెడ్ డాక్టర్ దెందుకూరి ఫణి పేర్కొన్నారు. తమ విద్యార్థులు కొండూరు శశిధర్ 99.99 పర్సంటైల్, ఎస్.దీక్షిత 99.82, సూరజ్ ఎస్ కామత్ 99.77, పాలపర్తి దినేష్ 99.32పర్సంటైల్ మార్కులతో ప్రతిభచాటారని తెలిపారు. తిరుపతి శాఖ నుంచి వివిధ కేటగిరీలలో 78మంది విద్యార్థులు అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించగా..వీరిలో 40మంది విద్యార్థులకు 90పర్సంటైల్‌కిపైగా మార్కులు వచ్చాయని వివరించారు. విద్యార్థులను ఫణితో పాటు అధ్యాపకులు అభినందించారు.

మోడల్ ఫౌండేషన్ స్కూల్ ఎంపికకు ఎఫ్‌ఎల్‌ఎన్ బృందం సందర్శన


ఎంఆర్‌పల్లెలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ బృంద సభ్యులు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 14: జిల్లాలో మోడల్ ఫౌండేషన్ స్కూల్ ఎంపిక కోసం స్టేట్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) బృంద సభ్యులు బుధవారం తిరుపతిలోని పలు ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఇందులో భాగంగా రాష్ట్ర కన్సల్టెంట్ బాలకృష్ణ నేతృత్వంలో ప్రథమ్ ప్రాజెక్ట్ అసోసియేట్ గీత కలసి నగరంలోని ఎస్‌టీవీనగర్, ఎంఆర్‌పల్లె, గంగమ్మగుడి వీధులలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. పాఠశాలల భవనాలు, తరగతి గదుల లభ్యత, ఫర్నీచర్, టీచర్ల పనితనం, విద్యార్థుల ప్రతిస్పందన వంటి అంశాలను పరిశీలించారు. బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 40 మోడల్ ఫౌండేషన్ పాఠశాలలను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. డీఈవో డాక్టర్ వి.శేఖర్, సంక్షేమ శాఖ పీడీ జయలక్ష్మిని సంప్రదించి మోడల్ ఫౌండేషన్ స్కూల్ ఎంపిక విధివిధానాలను వివరించారు.

డీకే కుటుంబంలో ఎవరు ఎటు?

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మాజీ ఎంపీ దివంగత డీకే ఆదికేశవులు కుటుంబీకులు ఒక్కొక్కరు ఒక్కో పార్టీలో కనిపిస్తున్నారు. ఆయన కుమారుడు డీఏ శ్రీనివాస్ జనవరి ఒకటో తేదీన అందరికీ విందు ఏర్పాటుచేసి వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటానని చెప్పి వెళ్లిపోయారు. ఇక, కుమార్తె తేజస్విని రా కదలిరా సభలో టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి వేదిక పంచుకున్నారు. ఆయన మనవరాలు చైతన్య జనసేనలో చేరి.. ఆ పార్టీ చిత్తూరు అభ్యర్థి తానేనని చెప్పుకొంటున్నారు.

చిత్తూరు రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన డీకే కుటుంబం.. ఇప్పుడు గందరగోళానికి తావిస్తోంది. వీరిలో ఎవరు.. ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారు.. అసలు పోటీ చేస్తారా, లేదా అనే అయోమయంలో చిత్తూరు వాసుల్లో నెలకొని ఉంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

జనసేనలో మనవరాలు చైతన్య


పవన్‌కల్యాణ్‌తో చైతన్య

ఆదికేశవులు మరణానంతరం ఆయన సతీమణి సత్యప్రభ 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి చిత్తూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు స్థానానికి టీడీపీ అభ్యర్థిగా పోటీచేశారు. కరోనా సమయంలో ఆమె కన్నుమూశారు. 2019 తర్వాత నుంచి ఆ కుటుంబ సభ్యులు చిత్తూరుకు, రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తొలుత ఆదికేశవులు మనవరాలు చైతన్య గతేడాది డిసెంబరు చివర్లో జనసేనలో చేరారు. అప్పటి నుంచి చిత్తూరు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి తానేనని చెప్పుకుంటూ ఆమె స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేసుకుంటున్నారు. ఆ పార్టీ నాయకులతో సమావేశమవుతున్నారు. జనసేన అధిష్ఠానం నుంచి మాత్రం ఈమె విషయంలో ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

టీడీపీలో కూతురు తేజస్విని

ఇటీవల జీడీనెల్లూరులో జరిగిన రా కదలిరా సభలో ఆదికేశవులు కుమార్తె తేజస్విని పాల్గొన్నారు. చంద్రబాబుకు పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. వేదికపై ఆసీనులయ్యారు. ఆమె చిత్తూరు టికెట్ ఆశించే చంద్రబాబును కలిశారని టీడీపీ నాయకులు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా బుధవారం ఆమెను కలిసేందుకు చంద్రబాబు అపాయింట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిసింది. చిత్తూరులోని కొందరు ప్రముఖ నాయకులతో ఆమె నేడు చంద్రబాబును కలవనున్నారు. కుటుంబ నేపథ్యం దృష్ట్యా తేజస్వినికి చంద్రబాబు ప్రాధాన్యతనిస్తారని టీడీపీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. నేటి భేటీ తర్వాత చిత్తూరు టీడీపీలో సమీకరణాలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.


జీడీనెల్లూరులో చంద్రబాబుతో తేజస్విని

అన్ని పార్టీలతో టచ్‌లో శ్రీనివాస్


మంత్రి పెద్దిరెడ్డితో డీఏ శ్రీనివాస్

గతేడాది డిసెంబరు చివర్లో చిత్తూరు నగరంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న డీఏ శ్రీనివాస్ వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటానని ప్రకటించారు. దీనికి అనుగుణంగా జనవరి ఒకటో తేదీన చిత్తూరులోని తన స్వగృహంలో ప్రముఖులకు విందు ఏర్పాటు చేశారు. టీడీపీ నేత కాజూరు బాలాజీ వేసిన పసుపు కండువాను కాసేపు మెడలో ఉంచుకున్నారు. ఆయన కండువా వేసుకోవడంతో పాటు, ఆయన చిన్నాన్న బద్రినారాయణ టీడీపీ కార్యక్రమాల్లో నిత్యం పాల్గొంటుండటం, జనవరి 1న విందుకు టీడీపీ నాయకులనే ఆహ్వానించడంతో.. శ్రీనివాస్ టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తారని అంతా భావించారు. అంతలోనే ఆయన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తోను, కొన్నాళ్లకు మంత్రి పెద్దిరెడ్డితో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీంతో కొన్నాళ్లపాటు ఆయన వైసీపీ వైపు మొగ్గు చూపుతున్నారని ప్రచారం జరిగింది. వీటన్నింటినీ ఆయన పటాపంచలు చేస్తూ ఏ పార్టీ వైపూ వెళ్లకుండా సైలెంట్ అయిపోయారు. ప్రస్తుతానికి ఆయనకు రాజకీయాల మీద ఆసక్తి లేదని సమాచారం.

రాజధాని పేరుతో జగన్‌రెడ్డి డ్రామాలు

▸▸ ప్రశ్నిస్తే విలేకరులపై దాడులా?: అచ్చెన్న



అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ ప్రాంతాన్నీ అభివృద్ధి చేయని ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయే జగన్‌రెడ్డి.. ఉమ్మడి రాజధాని పేరుతో కొత్త డ్రామా ఆడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. బుధవారం ఆయన ఓ ప్రకటన చేస్తూ, విశాఖలో జగన్‌రెడ్డి కుటుంబం రూ.40వేల కోట్ల విలువైన బినామీ ఆస్తుల్ని కూడగట్టుకుంది. అందుకే విశాఖే రాజధాని అన్నారు. మూడు రాజధానులకు కోర్టులు బ్రేకులు వేయడంతో జగన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి బినామీ ఆస్తులు కాపాడుకోవటానికి ఇప్పుడు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధాని చేయాలంటున్నారు. ఆ మాట కూడా జగన్‌రెడ్డిదే. అధికారంలోకి వచ్చాక అమరావతిని నాశనం చేశాడు' అని పేర్కొన్నారు. మరో రెండు నెలల్లో అధికారంలోకి వస్తాం.. అమరావతి పూర్తి చేస్తాం అని పేర్కొన్నారు. 'జగన్‌రెడ్డీ.. నువ్వు, నీ ముఠా దోపిడీలు, దుర్మార్గాలు చేస్తుంటే ఎవ్వరూ ప్రశ్నించకూడదా?' అచ్చెన్న మరో ప్రకటనలో నిలదీశారు. అమరావతిలో వైసీపీ నేతల ఇసుక దోపిడీని వెలుగులోకి తెచ్చిన విలేకరి పరమేశ్వరరావుపై దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విలేకరులు ఉంది ఎందుకు? మీ దారుణాలను కళ్లప్పగించి చూడటానికా? అని ప్రశ్నించారు.

●విలేకరులపై దాడులు నిత్యకృత్యం: ఆనందబాబు

జగన్‌రెడ్డి పాలనలో విలేకరులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనంద్‌బాబు అన్నారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 'వైసీపీ నేతల అక్రమ ఇసుక తవ్వకాలపై ఫోటోలు తీస్తే, వార్తలు రాస్తే వారిపైనే దాడులు చేస్తారా? అక్రమ మైనింగ్‌పై కేంద్ర పర్యావరణ శాఖ ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.

సజ్జలకు జైలు శిక్ష వేయాలి: ధూళిపాళ్ల

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పొన్నూరు, మంగళగిరి నియోజకవర్గాల్లో తనకు, తన కుటుంబ సభ్యులకు ఓట్లు కావాలని దరఖాస్తులు పెట్టినట్లు ఒప్పుకున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఎన్నికల సంఘ నియమావళి ప్రకారం ఏడాది జైలు శిక్ష, లేదా జరిమానా విధించాలని టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఫాం6 ప్రకారం ఓటర్ల నమోదు అధికారులకు సజ్జల తప్పుడు సమాచారం ఇచ్చారు. దీనికి ఏడాది జైలు/జరిమానా లేదా రెండూ విధించవచ్చు. అలాగే రెండు చోట్లా ఓటు హక్కు కల్పించిన ఈఆర్వోలు, ఇతర సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలి' అని కోరారు.

సీటు ఇవ్వలేదని.. సీఎం సీట్లో కూర్చున్నాడు!

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం రాష్ట్ర సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ముఖ్యమంత్రి స్థానంలో కూర్చుని వర్చువల్‌గా వివిధ పరిశ్రమలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించి, ప్రసంగించారు. దీనిపై టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రతిస్పందించారు. 'పాపం ఆయన మాత్రం ఏం చేస్తాడు.. పోటీకి సీటు ఇవ్వలేదని.. సెక్రటేరియట్‌కు వెళ్లి ఏకంగా సీఎం సీట్లో కూర్చున్నాడు. ముఖ్యమంత్రి కుర్చీ అంటే కేవలం చైర్ కాదు.. అదొక హోదా! వీళ్లకు అర్థం కాదు.. వీళ్ల పోకడలకు అర్థం లేదు' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

అవకతవకలపై చర్యలు తీసుకోవాలి: షరీఫ్

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల తుది జాబితాలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఆయన 10 లేఖలు రాశారు. 'గత నెల 22న ఓటర్ల తుది జాబితా ప్రకటించిన తర్వాత ఫామ్ 6,7,8/8ఏలకు సంబంధించి టీడీపీ అనేక ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదులపై ఎలాంటి సమాచారం ఎలెక్షన్ కమిషన్ వెబ్‌పోర్టల్‌లో కనిపించడం లేదు. పేర్లు సరిదిద్దడం, ఓట్ల తొలగింపు, చేర్పులు వంటి ఫిర్యాదుల వివరాలు అప్‌డేట్ చేసేలా నియోజకవర్గ ఎన్నికల అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు.

నేడు 'విధ్వంసం' పుస్తకావిష్కరణ

▸▸ చంద్రబాబు నుంచి తొలిప్రతి అందుకోనున్న పవన్

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్ట్ ఆలపాటి సురేష్‌కుమార్ రచించిన 'విధ్వంసం' పుస్తకాన్ని గురువారం సాయంత్రం టీడీపీ అధినేత చంద్రబాబు ఆవిష్కరించనున్నారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్‌లో జరిగే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పాల్గొని తొలి ప్రతిని అందుకోనున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో జరిగిన విధ్వంసం తీరును జర్నలిస్ట్ ఆలపాటి సురేష్‌కుమార్ తన ఈ పుస్తకంలో పొందుపర్చారు.

చిరుద్యోగులకు భరోసా కల్పిస్తాం: వీఆర్‌ఏలతో పవన్

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల్లో నామమాత్రపు వేతనంతో పనిచేస్తున్న చిరుద్యోగుల సమస్యలను అధ్యయనం చేసి, ఉమ్మడి మేనిఫెస్టోలో హామీ చేర్చడంపై పరిశీలిస్తామని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. బుధవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏపీ స్టేట్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏల అసోసియేషన్ ప్రతినిధులు పవన్‌కల్యాణ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. వీఆర్‌ఏలు, వెటర్నరీ అసిస్టెంట్లు, ఇతర చిరుద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పవన్ మాట్లాడుతూ చిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని, వారికి తగిన భరోసా కల్పించే బాధ్యతను రాబోయే ఉమ్మడి ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

ఏజెన్సీ గజగజ.. పడిపోయిన ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మధ్యభారతం మీదుగా గాలులు వీయడంతో బుధవారం ఉత్తర కోస్తాలో చలి పెరిగింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని ఏజెన్సీలో చలిగాలులకు ప్రజలు గజగజలాడారు. ఉదయం పది గంటల వరకు బయటకు రావడానికి ఇబ్బందిపడ్డారు. మంచు దట్టంగా కురవడంతో ఒక్కసారిగా రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఈ సీజన్‌లో రెండోసారి ఏజెన్సీలో అతితక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 5.8, అరకులోయలో 7, జీకే వీధిలో 7.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

5 లక్షలిచ్చినా వైసీపీకి ఓటేయను !

▸▸ టెలీకాలర్‌కు ఓటరు దిమ్మతిరిగే సమాధానం.. రాప్తాడు నేతలకు షాక్

రాప్తాడు, ఫిబ్రవరి 14: ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా... అంటూ ఫోన్ చేసి.. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికే ఓటేయండి అని అడిగిన టెలికాలర్‌కు.. 'ఐదు లక్షలిచ్చినా వేయను' అంటూ ఓ వ్యక్తి దిమ్మతిరిగే సమాధానమిచ్చారు. అనంతపురం జిల్లా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి వచ్చిన ఓ ఫోన్‌కాల్‌కు సంబంధించిన కాల్ రికార్డింగ్ ఆడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఆసరా లబ్ధిదారు నాగేంద్రమ్మకు టెలికాలర్ ఫోన్ చేయగా... ఆమె భర్త లిఫ్ట్ చేశారు. 'నాగేంద్రమ్మకు ఆసరా డబ్బు అందుతోందా? ఇతర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా...?' అని మొదట టెలికాలర్ ప్రశ్నించారు. అందుతున్నాయని ఆయన సమాధానమిచ్చారు. దీంతో వచ్చే ఎన్నికల్లో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఓటు వేయాలని టెలికాలర్ కోరారు. దీంతో నాగేంద్రమ్మ భర్త సమస్యలు ఏకరవు పెడుతూ.. 'ఎంబీఏ చదివిన నా కొడుకు ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాడు. ఉచిత పథకాల ద్వారా తిని కూర్చుని సోమరిపోతులవుతున్నాం. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే రాజధాని, పరిశ్రమలు ఉండాలి. ఉద్యోగాలు కల్పించాలి. కానీ, చదువుకున్న వారికి ఉద్యోగాల్లేవు. ఉద్యోగాలు కల్పించకుండా ఎన్ని సంక్షేమ పథకాలు ఇచ్చినా ఏం లాభం?' అని నిలదీశారు. తమ పిల్లల భవిష్యత్తు తమకు చాలా ముఖ్యమని, ఈ సారి వైసీపీ వాళ్లు ఎన్ని డబ్బులిచ్చినా ఓటు వేయబోమని స్పష్టం చేశారు.

ఆఫీసులన్నీ ఇచ్చేశాక ఉమ్మడి రాజధాని ఏమిటి?

▸▸ తెలంగాణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ప్రశ్న

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన జరిగి పదేళ్లవుతున్నా ఏపీకి రాజధాని లేక పోవడానికి ఆ రాష్ట్ర సీఎం వైఎస్ జగన్ పిచ్చి తుగ్లక్ వ్యవహారమే కారణమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని ఏపీ ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ 2019లోనే ఆ ప్రభుత్వం తెలంగాణకు అప్పగించేసిందని అలాంటప్పుడు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ మరో పదేళ్లు కొనసాగాలంటూ వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి అనడంలో ఔచిత్యమేమిటని ప్రశ్నించారు.



ఆ సర్క్యులర్ ప్రకారమే మహాకుంభాభిషేకం

▸▸ ఈవో ప్రొసీడింగ్స్, ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల లేఖలు పరిగణనలోకి తీసుకోండి

▸▸ శ్రీశైలంలో కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలపై దేవదాయశాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో ఈ నెల 16 నుంచి 21 వరకు నిర్వహించనున్న మహాకుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలను 2013లో దేవదాయశాఖ కమిషనర్ జారీచేసిన సర్క్యులర్ ప్రకారమే నిర్వహించాలని హైకోర్టు దేవదాయశాఖ అధికారులను బుధవారం ఆదేశించింది. రాష్ట్రంలోని దేవస్థానాల్లో నిర్వహించే దైవసంబంధ కార్యక్రమాల్లో ఎలాంటి ఆగమ సంకరణ లేకుండా నిర్వహించాలని అందులో పేర్కొన్నారని గుర్తు చేసింది. మహాకుంభాభిషేకం నిర్వహణ నిమిత్తం గతేడాది మే 8, 10వ తేదీల్లో శ్రీశైలం దేవస్థానం ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను పరిగణలోకి తీసుకోవాలంది. కుంభాభిషేకం ఇతర కార్యక్రమాలు ఏవిధంగా నిర్వహించాలనే విషయంపై దేవదాయశాఖ కమిషనర్‌కు ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు రాసిన లేఖలో పేర్కొన్న వివరాలను పరిగణలోకి తీసుకోవాలని పేర్కొంది. విచారణను మార్చి 13కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. శ్రీశైలంలో మహాకుంభాభిషేకం, ఉపాలయాల్లో లింగ, యంత్ర ప్రతిష్ఠ, శివాజీ గోపురంపై కలశ స్థాపన కార్యక్రమాలను వైదిక స్మార్త ఆగమం ప్రకారం నిర్వహించేలా దేవదాయశాఖ అధికారులను ఆదేశించాలని కోరుతూ గుంటూరుకు చెందిన పి.వెంకట బుచ్చిరామశాస్త్రి మరో ముగ్గురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ... గతంలో శ్రీశైల దేవస్థానంలో సంప్రోక్షణ కార్యక్రమాలను శైవాగమ, వైదిక పద్ధతుల్లో నిర్వహించారన్నారు. ప్రస్తుతం కూడా అవే పద్ధతులు అనుసరించేలా ఆదేశాలివ్వాలని కోరారు. దేవదాయశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది రజనీరెడ్డి వాదనలు వినిపిస్తూ... కలశస్థాపన, లింగ, యంత్ర ప్రతిష్ఠలను వీరశైవాగమ రిత్వికులు నిర్వహిస్తారన్నారు. అమ్మవారి దేవస్థానంలో నిర్వహించే మహాకుంభాభిషేకాన్ని స్మార్త ఆగమ పద్ధతిలో చేపడతామన్నారు. అఖిలభారత వీరశైవ ఆగమ పరిషత్ తరఫున న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ... శ్రీశైలం దేవస్థానంలో వీరశైవ ఆగమ పద్ధతుల్లోనే పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

పెంచి.. తగ్గించి!

▸▸ స్మార్ట్ మీటర్ల ధరలపై స్పష్టత లేని డిస్కమ్‌లు

▸▸ ధరలు పెంచేసి.. బిడ్‌లు

▸▸ అదానీ, షిర్డీసాయికి సొంతం

▸▸ విమర్శలు రావడంతో తగ్గింపు

▸▸ వాస్తవ ధరలపై ఇంధనశాఖ గోప్యం

▸▸ మోసం జరిగిందంటున్న నిపుణులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

స్మార్ట్ మీటర్ల ధరల విషయంలో విద్యుత్తు పంపిణీ సంస్థ(డిస్కమ్)లు ఇప్పటికీ ఒక స్పష్టతకు రాలేదు. బిడ్ విధానం పారదర్శకంగా ఉందని, రివర్స్ టెండర్లను, ఆ తర్వాత సంప్రదింపుల ప్రక్రియను చేపట్టామని చెబుతున్న డిస్కమ్‌లు వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతున్నాయి. తాజాగా విద్యుత్తు నియంత్రణ సంస్థ(ఏపీఈఆర్‌సీ) చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో కొన్ని గణాంకాలు వెల్లడించినా వాటిలోనూ స్పష్టత లేదని విద్యుత్తురంగ నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లను రెండు దశల్లో బిగించాల్సి ఉంది. వీటిలో 38,63,537 గృహ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్ల ధరలు రూ.12,047 నుంచి రూ.12,713 దాకా ఉంటే.. రాష్ట్రంలో మాత్రం.. రూ.13,578 నుంచి రూ.14,319 వరకు ఉందని డిస్కమ్‌లు ఇటీవల ఏపీఈఆర్‌సీకి అందించిన సమాచారంలో పేర్కొన్నాయి. స్మార్ట్ మీటర్ల ధరలను సమీక్షిస్తున్నామంటున్న డిస్కమ్‌లు.. ఏయే సంస్థలతో ఎంతెంత ధరలకు ఒప్పందం చేసుకున్నారో మాత్రం చెప్పడం లేదు. దీనిపై ఇంధన శాఖ కూడా నోరు మెదపకపోవడం గమనార్హం. మరోవైపు, స్మార్ట్ మీటర్ల బిడ్‌లలో అదానీ, షిర్డీసాయి సంస్థలు పాల్గొన్నాయి. 2022, మే 22న స్మార్ట్ మీటర్ల టెండర్ల ప్రక్రియ మొదలైంది. ఆనాటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయ మీటర్ల ధరలెంతో.. గృహ, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలకు స్మార్ట్ మీటర్లను బిగించినందుకు ఎంత వసూలు చేస్తారో అనే విషయాలను కూడా డిస్కమ్‌లు గాని.. ఇంధన శాఖగానీ అధికారికంగా ప్రకటించలేదు. 2024-25 వార్షిక ఆదాయ వ్యయ నివేదికపై ఏపీఈఆర్‌సీ చేపడుతున్న అభిప్రాయ సేకరణలో ఇస్తున్న సమాచారం కూడా గజిబిజిగానే ఉందని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల బిగింపు అంశంపై విద్యుత్తు రంగ నిపుణుడు ఎం. వేణుగోపాలరావు లేవనెత్తిన పలు ప్రశ్నలకు ఏపీఎస్పీడీసీఎల్ ఇచ్చిన సమాధానం వింతగా ఉంది. దీంతో అధికారులు అసలేం చెప్పదలచుకున్నారో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొంది. 2022, డిసెంబరు 5న 11 లక్షల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం ఎస్పీడీసీఎల్ పిలిచిన టెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3,369 కోట్లకు పరిపాలనా ఆమోదం తెలిపింది. టెండర్లను పిలిచాక.. 2022, డిసెంబరు 22న అవే టెండర్లను రూ.4,068.08 కోట్లకు పెంచుతూ ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపింది. ఇలా ఒక్కసారిగా ప్రభుత్వం పెద్దమొత్తంలో పెంచడానికి గల కారణాలను డిస్కమ్‌లు వివరించలేదు. ప్రభుత్వం కూడా వివరణ ఇవ్వలేదు. స్మార్ట్ మీటర్ల వ్యయాన్ని వినియోగదారుల నుంచి 93 నెలల్లో వాయిదాల రూపంలో వసూలు చేయాలని మాత్రమే డిస్కమ్‌లను ప్రభుత్వం ఆదేశించింది.



వ్యవసాయానికీ అంతే

ఏపీసీపీడీసీఎల్ 5 లక్షల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు 2022, డిసెంబరు 5న రూ.1531 కోట్లకు టెండర్లను పిలిచింది. దానిని 2023, జూన్ 21వ తేదీనాటికి ఏకంగా రూ.333.18 కోట్లను పెంచుతూ రూ.1864.54 కోట్లకు చేశారు. మరో 2.58 లక్షల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు మీటర్లను బిగించేందుకు 2022, డిసెంబరు 5న పరిపాలనా ఆమోదం పొందింది. దీనికి రూ.956.41 కోట్లకు పరిపాలనా ఆమోదం ఇచ్చిన ప్రభుత్వం.. ఆ వెంటనే రూ.699.08 కోట్లకు కుదించింది. అదేవిధంగా ఎస్పీడీసీఎల్ పిలిచిన టెండర్లకు అదానీ సంస్థ రూ.2288.25 కోట్లకు బిడ్ వేసింది. రివర్స్ టెండర్‌లో రూ.1990.78 కోట్లకు మీటర్లను బిగించేందుకు అదానీ సంస్థ అంగీకరించిందని ఎస్పీడీసీఎల్ పేర్కొంది. సంప్రదింపులు జరిపాక.. రూ.1386.93 కోట్లకు స్మార్ట్ మీటర్లను అమర్చేందుకు అంగీకరించినట్లుగా వెల్లడించింది. ఈ ధరలు అమాంతం 45.27 శాతం మేర(రూ.901.32 కోట్లను) తగ్గించేందుకు అంగీకరించడంలో అర్థమేమిటని నిపుణులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అంటే స్మార్ట్ మీటర్ల ధరలను అమాతం రెట్టింపు చేసి బిడ్‌లను వేసినట్లుగా స్పష్టమవుతోందని చెబుతున్నారు. రెట్టింపు ధరలకు బిడ్‌లను వేసినప్పుడు వాటిని ఎందుకు రద్దు చేయలేదని నిలదీస్తున్నారు. ఏపీసీపీడీసీఎల్ అదానీ నుంచి 7,23,131 సింగిల్ ఫేజ్ కనెక్షన్లకు మీటర్లను బిగించేందుకు అదానీతో ఒప్పందం చేసుకుంది. ఈ మీటర్లను బిగించేందుకు నెలకు రూ.95.99 చొప్పున 93 నెలల పాటు.. అంటే రూ.8927.07 ఒక్కో సింగిల్ ఫేజ్ మీటరును అప్పగిస్తామని అదానితో సీపీడీసీఎల్ ఒప్పందం చేసుకుంది. అదేవిధంగా 1,09,220 త్రీఫేజ్ మీటర్లు సరఫరా చేసేందుకు నెలకు రూ.185.87 చొప్పున 93 నెలల వాయిదాల చొప్పున రూ.17,285.91కు సరఫరా చేసేలా అదానీతో సీపీడీసీఎల్ ఒప్పందం చేసుకుంది. మరో 1,13,650 డీటీ మీటర్లకు నెలకు రూ.265.62 చొప్పున 93 నెలల పాటు వసూలు చేసేలా రూ.24702.66కు అదానీతో సీపీడీసీఎల్ అంగీకారం కుదుర్చుకుంది.

అస్మదీయులు కాబట్టే!

విద్యుత్తు మీటర్ల ధరలను నిశితంగా పరిశీలిస్తే.. అస్మదీయులమన్న ధీమాతో భారీగా రేట్లు పెంచేసి.. ఆ తర్వాత.. నిపుణులు, ప్రజా సంఘాల ఆందోళనలతో రివర్స్ టెండర్‌తో కొంత తగ్గించి.. ఆ తర్వాత సంప్రదింపుల సందర్భంగా మరింత తగ్గించడం వెనుక పెద్ద మోసమే దాగుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.2288.35 కోట్లకు వేసిన టెండరు ఏకంగా రూ.1386.93 కోట్లకు చేరుకోవడంలోనే.. భారీ మతలబు ఉన్నాయని విద్యుత్తు రంగ నిపుణులు అంటున్నారు.

సిఫారసులకే 'నైటింగేల్'..?

▸▸ నిజాయితీగా సేవ చేసిన నర్సులకు మొండిచేయి

▸▸ ప్రతిష్ఠాత్మక అవార్డుకు పదుల సంఖ్యలో దరఖాస్తులు

▸▸ కానీ.. మూడు విభాగాల్లో కలిపి ఒకరి పేరే ప్రతిపాదన

▸▸ స్ర్కూటినీ పారదర్శకంగా లేదని నర్సుల అభ్యంతరం

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రోగులకు అందించే విశిష్ఠ సేవలకు గుర్తింపుగా ప్రతి ఏటా నర్సులకు ప్రదానం చేసే 'ఫ్లోరెన్స్ నైటింగేల్' అవార్డుల విషయంలో సిఫారసు ఉంటేనే పని అవుతోంది. ఈ అవార్డు కోసం ప్రతి ఏటా రాష్ట్రాలు కొంతమంది నర్సుల పేర్లను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తాయి. ఆ జాబితా ఆధారంగా కేంద్రం ప్రతి సంవత్సరం మే 12న రాష్ట్రపతి చేతుల మీదగా 'ఫ్లోరెన్స్ నైటింగేల్' అవార్డులు ప్రదానం చేస్తుంది. నర్సు అడ్మినిస్ట్రేటర్, నర్సు ఎడ్యుకేటర్, హాస్పిటల్ సర్వీసెస్(మూడు విభాగాల్లో అవార్డులు అందిస్తారు. ఈ ప్రక్రియ కోసం ఈ ఏడాది కూడా దరఖాస్తులు ఆహ్వానించగా.. ఏపీ నుంచి మూడు విభాగాల్లో పదుల సంఖ్యలో నర్సులు కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసుల లేఖలను జతచేసి దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. ఈ సారి మూడు విభాగాల్లో కలిపి అనేక దరఖాస్తులు వచ్చినప్పటికీ డీఎంఈ అధికారులు మాత్రం నర్సు అడ్మినిస్ట్రేటర్ విభాగంలో ఒకే ఒక పేరు పంపించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. నర్సింగ్ ఎడ్యుకేషన్, హాస్పిటల్ సర్వీసెస్ విభాగాల్లో మరికొంత మంది పేర్లు పంపించే అవకాశం ఉన్నా.. వారందరినీ లిస్టు నుంచి తొలగించి.. నర్సు అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఒకరి పేరు మాత్రమే పంపించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీఎంఈ సిఫారసు చేస్తున్న ఆ మహిళా ఉద్యోగినిపై డీఎంఈ విజిలెన్స్‌లో అనేక ఫిర్యాదులున్నాయి. ప్రతిష్ఠాత్మక నైటింగేల్ అవార్డు కోసం పంపించే లిస్ట్‌లో అలాంటి వ్యక్తి పేరు ఎందుకు అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు నర్సుల పేర్లను స్ర్కూటినీ చేసిన కమిటీ కూడా పారదర్శకంగా లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం రాత్రి 8 గంటల వరకూ స్ర్కూటినీ నిర్వహించి, అందులో సిఫారసులున్న వారి పేర్లను మాత్రమే డీఎంఈకి ప్రతిపాదించినట్లు తెలిసింది. ఏదీ ఏమైనా అధికారులు రాష్ట్రం పరువు తీయకుండా, నిజాయతీగా సేవలందించిన వారికి ఈ అవార్డు దక్కేలా చూడాలని సూచనలు వినిపిస్తున్నాయి.

సామాజిక సేవలో ఎన్టీఆర్ ట్రస్టు విశేష కృషి

▸▸ విద్య, వైద్య రంగాల్లో పలు సేవలు

▸▸ ప్రకృతి వైపరీత్యాల్లో బాధితులకు బాసట

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న ఎన్టీఆర్ ట్రస్టు 27 వసంతాలు పూర్తిచేసుకుంది. సమాజాభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. 1997లో ఏర్పాటయిన ఈ ట్రస్టు రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్య, వైద్య రంగాల్లో పేదలకు అండగా నిలుస్తోంది. 1998 నుంచీ ప్రతీ సంవత్సరం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా జనవరి 18న మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ వస్తోంది. రెండు రాష్ట్రాల్లో రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. కోవిడ్ సమయంలో మూడు కేంద్రాల్లో ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేసి వేలాది మందికి ఆసరాగా నిలిచింది. 2005లో గండిపేటలో ప్రారంభించిన ఎన్టీఆర్ హైస్కూలు ఏటా వందలాది మంది పేద పిల్లలకు నాణ్యమైన విద్యనందిస్తోంది. ట్రస్టు ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం 2019లో ఎక్సెల్ సివిల్స్ అకాడమీని ఏర్పాటు చేశారు. నిరుద్యోగ యువతకు జాబ్ మేళాలు నిర్వహించారు. మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భాల్లో ట్రస్టు బాధితులకు బాసటగా నిలుస్తోంది. తెలుగు రాష్ట్రాలే కాకుండా దేశవ్యాప్తంగా ఎక్కడ ప్రకృతి విపత్తులు సంభవించినా తనవంతు సాయంగా స్పందిస్తోంది. 2009లో వరదల సందర్భంగా కర్నూలులో 5 లక్షల మంది బాధితులకు సాయం అందించింది. 2013లో ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న తెలుగువారిని ప్రత్యేక విమానాల్లో వారి సొంత ప్రాంతాలకు చేర్చింది. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అనే ఎన్టీఆర్ నినాదం స్ఫూర్తితో ట్రస్టు ఏర్పాటు చేసి 27 వసంతాలు పూర్తయిన సందర్భంగా గురువారం ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ట్రస్టు సీఈవో కె.రాజేందర్‌కుమార్, సీవోవో అడుసుమిల్లి గోపి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు తదితరులు బ్రోచర్ ఆవిష్కరించనున్నారు.

'ఒకే దేశం-ఒకే ఎన్నిక'ను వ్యతిరేకిస్తూ తమిళ అసెంబ్లీ తీర్మానం

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానాన్ని వ్యతిరేకిస్తూ, తాజా జనగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజనను ఖండిస్తూ బుధవారం తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించింది. ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ తీర్మానాలను ప్రవేశపెట్టి ప్రసంగిస్తూ బీజేపీ తీరుపై, కేంద్రప్రభుత్వ విధానాలపై నిప్పులు చెరిగారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానం రాజ్యాంగవిరుద్ధమని, దీనివల్ల రాష్ట్రాల హక్కులు హరించుకుపోవడం ఖాయమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పార్లమెంటు ఎన్నికలు ఒకేసారి నిర్వహించలేని మనం.. 30 రాష్ట్రాలకు, దేశంలోని అన్ని పార్లమెంటు స్థానాలకు ఒకేసారి నిర్వహించడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల ద్వారా అన్ని రాష్ట్రాల్లో పాగా వేయాలని బీజేపీ కుట్ర పన్నిందని, బీజేపీయేతర ప్రభుత్వాలను కూల్చివేసి, అక్కడ ఎన్నికలను నిర్వహిస్తే కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వమే గెలిచే అవకాశముందని, ఇది ప్రజాస్వామ్యానికి పూర్తి విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం ద్వారా దేశానికి పెనుముప్పు తప్పదని హెచ్చరించారు. అదే విధంగా తాజా జనగణన మేరకు నియోజకవర్గాల పునర్విభజన విధానం కూడా సరికాదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యంగా తమిళనాడులోని ఎంపీల సంఖ్యను తగ్గించేందుకు జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. తమిళనాడులో 39 మంది ఎంపీలుంటేనే కనీసం పట్టించుకోవడం లేదని, ఇక ఆ సంఖ్య తగ్గితే తమ హక్కుల్ని సాధించుకోవడం సాధ్యమేనా అని ప్రశ్నించారు.

తిరునల్వేలి జిల్లాలో ఘోరం.. 1448 మంది బాలికల గర్భధారణ

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని తిరునల్వేలి జిల్లాలో 1,448 మంది మైనర్ బాలికలు మాతృత్వం పొందారనే దిగ్ర్భాంతికర విషయం వెలుగు చూసింది. ఈ జిల్లాకు చెందిన ఒక సంఘ సేవకుడు సమాచార హక్కు చట్టం కింది జిల్లా వ్యాప్తంగా గర్భందాల్చిన బాలికల సంఖ్యపై ఆరా తీశాడు. ఇందులో గత 2021 జనవరి నెల నుంచి గత ఏడాది అక్టోబరు నెల వరకు మొత్తం 34 నెలల్లో ఏకంగా 1,448 మంది 18 ఏళ్లలోపు బాలికలు గర్భందాల్చి, బిడ్డలకు జన్మనిచ్చినట్టు వెల్లడైంది.

కామోద్దీపన మాత్రలు వేసుకుని శృంగారం

▸▸ తొలి రాత్రి భార్యపై భర్త ఆటవిక చర్యతో మృత్యువాత

హమీర్‌పూర్, ఫిబ్రవరి 14: బాధ్యతారాహిత్యంతో ఓ వ్యక్తి చేసిన పని నవవధువు ప్రాణాలను బలిగొంది. తొలి రాత్రే ఆటవికంగా శృంగారం చేయడంతో వివాహిత చనిపోయింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లో జరిగిన ఈ పాశవిక ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శోభనం రోజు కామోద్దీపన పెంచే మాత్రలు వేసుకున్న వరుడు.. బాధితురాలిపై రాక్షసంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె జననాంగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆపై ఇన్ఫెక్షన్ కావడంతో వివాహిత తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో ఈ నెల 7న ఆమెను కాన్పూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి 10న ఆమె చనిపోయింది. గ్యాంగ్ రేప్ చేసినంత దారుణంగా బాధితురాలిపై అత్యాచారం జరిగిందని ఆమెకు చికిత్స అందించిన డాక్టర్ తెలిపారు. వివాహితకు తల్లిదండ్రులు లేరు. ప్రభుత్వ ఉద్యోగి అయిన ఆమె సోదరుడు.. ఫిబ్రవరి 3న సోదరి వివాహాన్ని ఘనంగా జరిపించారు. 4న ఆమెను అత్తగారింటికి పంపించారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి బంధువులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న వరుడు పరారయ్యాడు.

మణిపూర్‌లో పోలీసు ట్రైనింగ్ క్యాంపుపై దాడి

▸▸ పోలీసుల కాల్పుల్లో ఒకరి మృతి, పలువురికి గాయాలు

ఇంఫాల్, ఫిబ్రవరి 14: మణిపూర్ ఇంఫాల్ జిల్లాలోని పంగై పోలీసు ట్రైనింగ్ క్యాంపుపై సమీప గ్రామానికి చెందిన కొందరు యువకులు దాడికి యత్నించారు. వారిని నిలువరించేందుకు పోలీసులు కాల్పులు జరపగా ఓ 24ఏళ్ల యువకుడు మృతి చెందాడు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసు ట్రైనింగ్ క్యాంపులో ఉన్న ఆయుధాల కోసమే యువకులు దానిపై దాడి చేసి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ముందుగా యువకులను నియంత్రించేందుకు పోలీసులు బాష్ప వాయువును ప్రయోగించారని, అయినప్పటికీ వారు లొంగకపోవడంతో కాల్పులు జరపాల్సి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలిపారు.

డిజిటల్ లావాదేవీలు మరింత భద్రం

▸▸ ఓటీపీకి ప్రత్యామ్నాయ అథెంటికేషన్ విధానాలపై ఆర్బీఐ దృష్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఈ లావాదేవీల భద్రతను మరింత పెంచడంతోపాటు వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండేలా అత్యాధునిక అథెంటికేషన్ సదుపాయాల అమలుకు బ్యాంకులను ప్రోత్సహించాలని ఆర్బీఐ యోచిస్తోంది. ప్రస్తుతం వినియోగదారులు డిజిటల్ లావాదేవీలను పూర్తి చేయడానికి ఎస్ఎంఎస్ ఆధారిత వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ)ను ఆర్థిక సంస్థలు వినియోగిస్తున్నాయి. నమోదైన మొబైల్ నంబరుకు బ్యాంకులు పంపిన ఓటీపీని నిర్దేశిత సమయంలో ఎంటర్ చేయడం ద్వారా ఆన్‌లైన్ లావాదేవీ పూర్తవుతున్న విషయం తెలిసిందే. అయితే ఇది పూర్తి సురక్షితంగా ఉండటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. యూపీఐ లావాదేవీల్లో మోసాలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో డిజిటల్ లావాదేవీలకు మరింత భద్రత కల్పించాలని, ఇందులో భాగంగా యాప్ ఆధారిత అనుమతి, బయోమెట్రిక్ అథెంటికేషన్ వంటి ప్రత్యామ్నాయ విధానాలను అనుసరించేలా ప్రోత్సహించాలని ఆర్బీఐ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో నూతన విధాన ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. టెక్నాలజీ పురోగతితో ఇటీవలి కాలంలో ప్రత్యామ్నాయ అథెంటికేషన్ విధానాలు వృద్ధి చెందాయి. దీంతో డిజిటల్ లావాదేవీల భద్రతను పెంచేలా ఈ విధానాలను అనుసరించేందుకు ఓ ఫ్రేమ్‌వర్క్‌ను ఆర్బీఐ ఇటీవల ద్రవ్య విధాన కమిటీ నిర్ణయాల్లో ప్రకటనలో భాగంగా ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన వివరణాత్మక సూచనలు విడుదల చేయాల్సి ఉంది.

వర్సిటీల ఉద్యోగులకూ 62 ఏళ్లు

▸▸ బోధనేతర సిబ్బందికీ వర్తింపు.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉత్తర్వులు

▸▸ ఇప్పటి నుంచే అమల్లోకి .. ఇటీవలే రిటైరైన 300 మందికి నష్టం

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ యూనివర్సిటీల్లోని బోధనేతర సిబ్బందిని ఆకర్షించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వారి పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఉన్నత విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఉత్తర్వులు జారీఅయిన రోజు నుంచే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. దీనివల్ల సుమారు 11,500 మంది ఉద్యోగులకు పదవీ విరమణ వయసు పెరుగుతుంది. దాదాపు మూడేళ్లుగా తమకూ రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లు చేయాలని ఉన్నత విద్యాశాఖ పరిధిలోని బోధనేతర ఉద్యోగులు ప్రభుత్వాన్ని అడుగుతూ వస్తున్నారు. గతంలో 62 ఏళ్లు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఉత్తర్వులు మాత్రం ఇవ్వలేదు. ఈలోపు వర్సిటీల్లోని బోధనా సిబ్బంది పదవీవిరమణ వయసును 65 ఏళ్లకు పెంచారు. కానీ బోధనేతర సిబ్బందిని మాత్రం పట్టించుకోలేదు. ఈలోగా అనేక మంది ఉద్యోగులు 60 ఏళ్లు నిండటంతో రిటైర్ అయిపోయారు. ఈ ఉత్తర్వులు ఆలస్యం కావడం వలన సుమారు 300 మంది ఉద్యోగులు నష్టపోయారు. ఉత్తర్వులు జారీచేసిన రోజు నుంచే 62 ఏళ్ల నిబంధన అమల్లోకి అని స్పష్టం చేయడంతో జనవరిలో రిటైర్ అయిన వారికీ ఇది వర్తించకుండా పోయింది. కాగా.. బోధనేతర సిబ్బందికి 62 ఏళ్లు చేయడం పట్ల యూనివర్సిటీల బోధనేతర ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటప్పారెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నత విద్యా మండలికి లేదు

యూనివర్సిటీల పరిపాలనా వ్యవహారాలకు కేంద్ర బిందువైన ఉన్నత విద్యామండలికి తాజా ఆదేశాలు వర్తించవని అధికారులు స్పష్టం చేశారు. పదో షెడ్యూలులో ఉన్నప్పటికీ మండలి విభజన జరగలేదు. దీంతో ప్రస్తుతం ఏపీ ఉన్నత విద్యామండలిలో ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులున్నారు. వారికి 62 ఏళ్లు వర్తింపజేయడం ఇష్టంలేకే మండలి అధికారులు ఈ మేరకు ప్రతిపాదనలు పంపారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తెలుగు అకాడమీకి కూడా తాజా ఆదేశాలు వర్తించవని అధికారులు తెలిపారు.

వైసీపీ ఎమ్మెల్యే ప్రత్యేకం గురూ!

▸▸ కుటుంబ సభ్యులకు రెండేసి ఓట్లు

▸▸ గుంటూరు జిల్లా పెదకూరపాడులో వెలుగు చూసిన ఓట్ల అక్రమాలు

పెదకూరపాడు, ఫిబ్రవరి 14: ఓటర్ల తుది జాబితాలో గుంటూరు జిల్లా పెదకూరపాడు వైసీపీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కుటుంబ సభ్యులకు రెండు నియోజకవర్గాల్లో ఓట్లు ఉండటం స్థానికంగా వివాదానికి దారి తీసింది. అదేసమయంలో ఓట్ల అక్రమాల అనుమానాలను మరింత పెంచింది. పోలింగ్ కేంద్రాల వారీగా మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించి పలుమార్లు బీఎల్‌వోల ద్వారా వినతులు స్వీకరించినా క్షేత్రస్థాయిలో మార్పు కనిపించలేదు. అధికార పార్టీకి చెందిన వారికి అవసరమైన చోట్ల ఓటు చేర్చడం, రెండు ఓట్లున్నా తొలగించకపోవడం, ప్రతిపక్ష పార్టీల వారి ఓట్లను గ్రామంలో లేరనే సాకుతో ఉన్న ఒక్క ఓటును తొలగించడం పరిపాటిగా మారింది. పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు గ్రామంలోని 194వ పోలింగ్ బూత్ పరిధిలో ఎమ్మెల్యే సోదరుడు నంబూరు రఘునాథరావుకు ఓటు ఉంది. అదేవిధంగా తాడికొండ నియోజకవర్గం తుళ్లూరు మండలం పెదపరిమిలో 435 నెంబరులోనూ ఓటు ఉంది. ఎమ్మెల్యే సోదరి భాష్యం పద్మావతికి త్యాళ్లూరులో 578, పెదపరిమిలో 417 నెంబరులో ఓట్లు ఉన్నాయి. ఎమ్మెల్యే బావ భాష్యం వీరాంజనేయులుకు త్యాళ్లూరులో 579, పెదపరిమిలో 414 నెంబర్‌లలో, అన్నకోడలు నంబూరు కల్పనకు త్యాళ్లూరులో 585, పెదపరిమిలో 439 బూత్‌లోనూ ఓట్లు ఉన్నాయి. ఎమ్మెల్యే మరోసోదరి పోతుగుంట్ల విజయలక్ష్మికి త్యాళ్లూరులో 583, పెదపరిమిలో 171, బావ పోతుగుంట్ల ఉమామహేశ్వరరావుకు త్యాళ్లూరులో 584, పెదపరిమిలో 170 నెంబర్లలో ఓట్లు ఉన్నాయి. వీరితో పాటు త్యాళ్లూరు గ్రామానికి సంబంధంలేని భాష్యం దివ్య, నంబూరు శ్రీదేవి, ఘట్టమనేని సూర్యప్రకాశ్, తదితరులకు కూడా ఓట్లు ఉన్నాయి. బూత్ స్థాయి అధికారులు అధికార పార్టీ నాయకులతో మిలాఖత్ అయి దొంగ ఓట్లపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గంలోని బెల్లంకొండ మండలంలో బడిపిల్లలకు కూడా ఓటు నమోదు చేయడం, పెదకూరపాడు మండలంలో కుటుంబ సభ్యులకు దొంగ ఓట్లు చేర్పించడం చర్చనీయాంశమైంది. గతంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దిగువ స్థాయి నాయకునితో మాట్లాడుతూ ఇతర పార్టీల వారు గ్రామంలో లేకపోతే ఓట్లు తీయించమని, మన పార్టీ వారైతే ఇతర ప్రాంతాలలో ఉన్నా ఓటు నమోదు చేయమనడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. ఎన్నికల అధికారులు దృష్టి పెట్టాలని ప్రతిపక్ష నేతలు కోరుతున్నారు.